సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక 22-11-2024 ₹ 15/-




## ఎన్నికల ప్రచారమా?
## విద్వేష సేద్యమా??



### బహుముఖ ప్రజ్ఞాశాలి మౌలానా ఆజాద్



### వక్ఫ్ ప్రాపర్టి అల్లాహ్ ఆస్తి

గీటురాయి
వారపత్రిక

**GEETURAI WEEKLY**

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

సంపుటి: 46 సంచిక: 47 హైదరాబాద్
శుక్రవారం 22 నవంబర్ 2024 రూ.15-00
19 జమాది ఉల్ ఊలా 1446 హిజ్రీ

**తొలిగీటు**

మానవులపై దయ చూపని వానిపై, వారి పట్ల దాక్షిణ్యంతో వ్యవహరించని వ్యక్తిపై దైవ కారుణ్యం వర్షించదు.

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)

**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**




## లోపల...

| | |
|---|---|
| ట్రంప్ ఎఫెక్ట్ ...... | 04 |
| ఎన్నికల ప్రచారమా? విద్వేష సేద్యమా?? ...... | 05 |
| బహుముఖ ప్రజ్ఞాశాలి మౌలానా ఆజాద్ ...... | 08 |
| పిల్లల పెంపకం పేరెంట్స్‌కు సూచనలు ...... | 10 |
| వక్ఫ్ ప్రాపర్టీ అల్లాహ్ ఆస్తి ...... | 14 |
| జ్ఞాపక శక్తికి మారుపేరు మదర్సా విద్యార్థులు ...... | 17 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్ఆన్ అనువాదం) ...... | 18 |
| అడుగుజాడలు ...... | 19 |
| మతం–రూపం–ఆవశ్యకత ...... | 24 |
| అది అప్పు తీర్చాల్సిందే! ...... | 27 |
| ముస్లిమేతరులతో ప్రవక్త (స) ...... | 28 |
| బాధ్యతను గుర్తు చేసేందుకే ఇజ్తెమా! ...... | 31 |
| అల్లాహ్ కోసమే ప్రేమించండి ...... | 32 |
| పిసినారి వ్యాపారి ...... | 34 |




ఒంటికాల్న లేస్తుండు
కాంగ్రేసుపైన హరీషు
తల్చుకుంటే క్షణంలో
చేసేస్తడంట మటాషు!
బావమర్దితోని కలిసి
వేస్తున్నడంట పథకం
ఒకరికొకరు తోడుగ
అల్లుతున్రు కథనం!

**– యం.డి. ఉస్మాన్ ఖాన్**

# ఆలోచన

## ట్రంప్ ఎఫెక్ట్

**ఇస్రాయీల్‌కు** అమెరికా అందిస్తున్న సహాయం ఆగిపోతుందా? ట్రంప్ ఎన్నిక జరిగింది కాని ఇంకా ఆయన అధ్యక్షుడు కాలేదు. అమెరికా అధ్యక్షుడిగా బైడెన్ చివరి రోజులు నడుస్తున్నాయి. గజా, లెబనాన్‌లలో పౌరనివాసాలపై విచక్షణ లేకుండా బాంబు లేసి సాధారణ ప్రజలను ఇస్రాయీల్ హతమారుస్తుందనడంలో ఇప్పుడు ఎవరికి సందేహం లేదు. అమెరికా పత్రికలు కూడా ఇది నరసంహారంగా పేర్కొన్నాయి. గజా, లెబనాన్‌లో బాధితు లకు సహాయసామగ్రి సరఫరా కాకుండా కూడా ఇస్రాయీల్ అడ్డుకుంటోంది. సహాయసామాగ్రి సరఫరాను అడ్డుకోవద్దని అమెరికా చెప్పడమే కాదు 30 రోజుల అల్టిమేటమ్ జారీ చేసింది. కాని ఇస్రాయీల్ అమెరికా మాటలకు పూచికపుల్ల పాటి విలువ ఇవ్వలేదు. అమెరికా జారీ చేసిన 30రోజుల అల్టిమేటమ్ కూడా ముగిసింది.

ఇప్పుడు ఇస్రాయీల్‌కు ఆయుధాల సరఫరాను అమెరికా ఆపేస్తుందన్న మాటలు వినిపిస్తున్నాయి. ఇస్రాయీల్‌కు స్వంత బలం అంటూ ఏదీలేదు. అమెరికా సహాయం లేకపోతే ఇస్రా యీల్ ఒక్కరోజు కూడా నిలబడలేదు. ఇస్రాయీల్ వార్తా సంస్థ హారెట్జ్ ప్రకారం అమెరికా ఇస్రాయీల్‌కు ఆయుధాల సరఫరా ఆపవచ్చు, ఐక్యరాజ్య సమితిలో ఇస్రాయీల్‌కు వ్యతిరేకంగా ప్రవేశపెట్టే తీర్మానాలను కూడా వీటో చేయకుండా వదిలేయ వచ్చు.

అమెరికా విదేశాంగ మంత్రి అంతోని బ్లింకన్, ఇస్రాయీల్ మంత్రి రాన్ డెర్మర్‌ల సమావేశంలో కూడా ఎలాంటి ఫలితాలు రాలేదు. జనవరిలో ట్రంప్ అధికారంలోకి వస్తే తనకు మంచి రోజులు వస్తాయని నెతన్యాహు అనుకుంటున్నాడు. ఎందుకంటే ఇప్పుడు ఇస్రాయీల్‌పై హిజ్బుల్లా దాడులు ఏ స్థాయికి చేరుకున్నా యంటే నెతన్యాహు బంకర్లలో తలదాచుకునే పరిస్థితి వచ్చిందని వార్తలు చెబుతున్నాయి.

గజాలో ఆసుపత్రులు, స్కూళ్ళపై ఇస్రాయీల్ దాడులు ఆపడం లేదు. పైగా గజా ఆసుపత్రుల్లో డాక్టర్లను కూడా నిర్బంధంలోకి తీసుకుని బాధితులకు వైద్యం అందకుండా అడ్డుకుంటోంది. గజాలో అత్యంత క్రూరంగా వ్యవహరిస్తున్న ఇస్రాయీల్‌కు అమెరికా ఆయుధాల సరఫరాతోనే ఇంత బలం లభించింది. ఇప్పుడు అమెరికాలో అధికారం మారబోతోంది. ట్రంప్‌కు లభిం చిన ఓట్లను చూస్తే యూదులు ట్రంప్‌కు ఈసారి ఓటు వేయ లేదని, పెద్ద సంఖ్యలో యూద ఓటర్లు బైడెన్ పార్టీనే సమర్ధించా రని విశ్లేషణలు వచ్చాయి. అయినా బైడెన్ పార్టీ ఓడిపోయింది. ఇస్రాయీల్‌కు గుడ్డిగా సమర్ధన అందిం చినప్పటికీ ఓటమి తప్పలేదు. ఇప్పుడు బైడెన్ పార్టీకి ఎన్నికల ఒత్తిళ్ళు కూడా ఏమీ లేవు. పైగా నెతన్యాహు వ్యవహరిస్తున్న తీరుతో బైడెన్ ప్రభుత్వం చికాగ్గానే ఉంది. కాబట్టి ఆయుధాల సరఫరా ఆగ వచ్చు.


ట్రంప్ జనవరిలో అధికారానికి వచ్చే వరకు ఇస్రాయీల్ ఆయుధ సరఫరా లేకుండా యుద్ధంలో నిలబడగలదా? ట్రంప్ వస్తే ఇస్రాయీల్‌కు గుడ్డిగా మద్దతు లభిస్తుందా? విశ్లేషకుల ప్రకారం అమెరికా ఖర్చులను విపరీతంగా పెంచేసే ఇస్రాయీల్ సహాయాన్ని ట్రంప్ కూడా కొనసాగించడం కష్టమే.

అంతర్జాతీయంగా ఇప్పుడు ఇస్రాయీల్ ఒంటరిదై పోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ వాతావరణంలో ట్రంప్ అధ్యక్షుడిగా వచ్చినా ఇస్రాయీల్‌కు గుడ్డిగా మద్దతు సాధ్యం కాకపోవచ్చు. ఇప్పుడు సౌదీ కూడా గజా విషయంలో స్పష్టమైన ప్రకటనలు చేయడమే కాదు ఈరాన్‌కు మద్దతుగా మాట్లాడుతోంది.

ఇస్రాయీల్ ప్రజలు ఇప్పుడు నెతన్యాహుకు వ్యతిరేకంగా ప్రదర్శనలు చేస్తున్నారు. సైన్యంలో కూడా వ్యతిరేకత పెరుగు తోంది. రక్షణ మంత్రిని తొలగించిన తర్వాత ఈ వ్యతిరేకత మరింత పెరిగింది. హమాస్ వద్ద బందీలను విడిపించడానికి నెతన్యాహు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. యుద్ధం కొనసాగాలని ఆయన కోరుతున్నాడు. ఇప్పటి వరకు బందీల్లో చాలా మంది సురక్షితంగా హమాస్ వద్ద ఉన్నారనే వార్తలు వస్తున్నాయి. కాని ఇస్రాయీల్ దాడులే వారిని హతమార్చినా ఆశ్చర్యం లేదు.

ఇప్పుడు నెతన్యాహు బంకర్లలో తలదాచుకునే పరిస్థితి వచ్చింది. మరోవైపు నెతన్యాహుకు వ్యతిరేకంగా ప్రజలు రోడ్లపైకి వస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ట్రంప్ అధికారానికి వచ్చినా నెతన్యాహుకు ఎంత సహాయం లభిస్తుందో చెప్పలేం. ఏది ఏమైనా ఇప్పుడు చాలా వాస్తవాలు ప్రపంచానికి స్పష్టంగా అర్థమవుతున్నాయి. ఇస్రాయీల్ బలం ఎంతో వాపు ఎంతో ప్రపంచానికి తెలిసింది. అమెరికాలో రాజకీయాలు ఎలా ఇస్రాయీల్ అడుగులకు మడుగులొత్తుతున్నాయో ప్రపంచానికి తెలిసింది. ఇస్రాయీల్ ఎంత క్రూరమైన విధానాలు పాటిస్తుందో కూడా ప్రపంచానికి తెలిసింది. పలస్తీనా సమస్యకు ఒక పరిష్కారం మాత్రం ప్రపంచం సాధించలేకపోతోంది. ✤

అబ్దుల్ వాహెద్




**ఏక్ హై తో సేఫ్ హై... బటేంగే తో కటేంగే .. లవ్ జిహాద్ ... ల్యాండ్ జిహాద్ ... బేటీ లూట్ లే జాయేంగే ... రోటీ లూట్ లే జాయెంగే... భైంస్ లూట్ లేంగే .. మంగళ్ సూత్ర్ లే జాయేంగే ...**

ఇవేనా ఇప్పుడు భారతదేశంలో ముఖ్యమైన సమస్యలు. ప్రజలకు ఈ నినాదాలే రుచిస్తున్నాయా? ఎన్నికలు ఎప్పుడు జరిగినా ... ఎక్కడ జరిగినా ఇలాంటి ప్రసంగాలే ఓట్లు రాలుస్తాయా?

ఇప్పుడు అసలు ప్రజా సమస్యలేవీ ఎన్నికల్లో ప్రస్తావనకు రావడం లేదు. పైన చెప్పిన విద్వేష ప్రసంగాలు నినాదాల హోరు కొన సాగుతోంది.

అసలు ఈ ఎన్నికలు ఎందుకు జరుగుతున్నాయి. ప్రజారంజకమైన పరిపాలన అందించే పాలకులను ఎన్నుకోడానికి, ప్రజాసమస్యలను పరిష్కరించే వారిని గద్దెపై కూర్చోబెట్టడానికి జరిగే ఎన్నికలేనా? లేక బీజేపీ వారిని ఏకం చేయడానికా? ఈ ఎన్నికల్లో బీజేపీ నేతలు చేస్తున్న ప్రసంగాల్లో ఏక్ హైతో సేఫ్ హై... బటేంగేతో కటేంగే... ఈ నినాదాలు దేనికి? ఎవరిని ఏకం చేస్తున్నారు, ఎవరికి వ్యతిరేకంగా ఏకం చేస్తున్నారు? బటేంగేతో కటేంగే నినాదంలో అంతరార్థం ఏమిటి? ఎవరితో ప్రమాదం ఉంది? ఈ విధమైన రాజకీయాలు ఇంకెంత కాలం?

ఈ నినాదాలేనా మనకు కావలసింది. వైద్యసదుపాయాలు, మంచి ఆసుపత్రులు, వాయుకాలుష్యం లేని వాతావరణం, మంచి రోడ్లు, ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు, అందుబాటులో నిత్యావసర వస్తు ధరలు వీటి గురించి మాట్లాడేదెప్పుడు? ప్రజలకు ఈ సమస్యలు సమస్యలు కావా?

ఎన్నికలు ఏ సమస్యలపై జరుగుతున్నాయి? ఎలాంటి ప్రసంగాలు వినిపిస్తున్నాయి? ఎలా విద్వేషాన్ని సాగు చేయడం జరుగుతోంది? ఎలా ఫేక్ వార్తలు వ్యాపిస్తున్నాయి? ఇవన్నీ ప్రజలు గమనించడం లేదా? ఇటీవల ముస్లిములు సాధువుల వేషాల్లో మోసం చేస్తున్నారనే వార్త వైరల్ అయ్యింది. చివరకు తెలిసిందేమిటంటే, ఆ సాధువులు హిందువులే ముస్లిములు కాదు. ఇలాంటి చాలా వైరల్ వార్తలు విద్వేష ప్రచారం చేస్తున్నాయి. ప్రజా సమస్యల గురించి ఎవరు పట్టించుకోని వాతావరణాన్ని సృష్టిస్తున్నారు.

మహారాష్ట్రలో దాదాపు సంవత్సరం నుంచి పరిశ్రమలను గుజరాత్

తరలించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే వార్తలు వస్తున్నాయి. దీనిపై ఎక్కడా చర్చ జరగడం లేదు. నిజానికి మహారాష్ట్రలో ఎన్నికలు జరుగుతున్నాయి. ఎన్నికల్లో ఇది సమస్యగా చర్చకు రావలసింది. కాని ఇప్పుడు జరుగుతున్నది ఏమిటి?

మహారాష్ట్ర ఎన్నికల సందర్భంగా బీజేపీ ఒక ప్రకటన దినపత్రికల్లో విడుదల చేసింది. ఏక్ హై తో సేఫ్ హై అంటున్న ప్రకటన అది. ఏకమై ఉంటే సేఫ్ గా ఉంటామనే నినాదం. ఇప్పుడు ఎవరి సేఫ్టీకి ఎలాంటి ప్రమాదం వచ్చింది? ఎవరితో ప్రమాదం ఉంది? ఈ ప్రశ్నల గురించి ఆలోచిస్తే ఈ ప్రకటన వెనుక ఉన్న ఉద్దేశ్యాలు అర్థమవుతాయి. ఇంతకు ముందు బటేంగేతో కటేంగే అనే నినాదం ఇచ్చారు. ఇందులో కటేంగే అనే మాట గమనించదగింది. ఎవరు దాడి చేస్తారు? ఎవరు హాని కలిగిస్తారు? ఇవన్నీ ప్రజల్లో చిచ్చు పెట్టే మాటలు. నిజానికి హిందూ ముస్లిం సమైక్యత గురించి మాట్లాడడం లేదు. ఒక వర్గానికి వ్యతిరేకంగా మరో వర్గాన్ని, మరో సముదాయాన్ని ఒక్కటి చేసి ఉసిగొలిపే నినాదాలివి.

వివిధ సముదాయాలను ఒక్కటి చేసే నినాదమని బీజేపీ నేతలు చెబుతున్న మాటలను ఎంతవరకు నమ్మగలం? కాని గత పదేళ్ళుగా దేశంలో మతతత్వ శక్తులు ఎలాంటి చిచ్చుపెడుతున్నాయో, ఎలాంటి పరిస్థితులు సృష్టించాయో అందరికీ తెలుసు. అందువల్ల ఏక్ హైతో సేఫ్ హై అనే నినాదం వెనుక ఉన్న ఉద్దేశ్యాలను పసిగట్టడం అంత కష్టం కాదు. కావాలంటే మనం బీజేపీ ఇచ్చిన ప్రకటననే చూసుకోవచ్చు. “ఏక్ హై తో సేఫ్ హై” అని రాసిన అక్షరాల్లో రకరకాల టోపీలు, తలపాగాలు అక్షరం లోపల కనిపిస్తాయి. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలు ధరించే టోపీలు, తలపాగాలను అక్షరాల్లో నింపి సమైక్యతను చాటామని చెబుతున్నారు. ఆ టోపీలను, తలపాగాలను ఎంత వెదికినా మనకు ఒక రకం టోపీలు, ఒక సముదాయం విస్తృతంగా ధరించే టోపీ ఎంత వెదికినా కనిపించదు. ముస్లిముల కార్యక్రమాల్లో నేతలు వెళుతున్నప్పుడు ఇక్కడ కనిపించని ఆ టోపీని ధరించి కనిపిస్తుంటారు. ముస్లిములు ధరించే టోపీ ఈ ప్రకటనలో ఎక్కడా కనిపించదు. ఏక్ హై తో సేఫ్ హై నినాదంలో ఎవరిని ఏకం చేస్తున్నారు? ఎవరికి వ్యతిరేకంగా ఏకం చేస్తున్నారన్నది అర్థం చేసుకోవడం అంత కష్టం కాదు.

సమైక్యత గురించి మాట్లాడుతున్నప్పుడు హిందూ ముస్లిం సిక్ ఈసాయీ భాయీ భాయీ అనే మాటలు ఇంతకు ముందు వినిపించేవి. ఇప్పుడా మాటలు వినిపించడం లేదు. ఇప్పుడు ఏక్ హైతో సేఫ్ హై అని చెబుతూనే ఏకం కావలసిన వారి టోపీలు మాత్రమే అక్కడ చూపించారు. అన్ని రకాల టోపీలు, తలపాగాలను వెదికి వెదికి ఆ అక్షరాల్లో చూపించారు కాని, ముస్లిములు ధరించే టోపీకి అక్కడ చోటు లేదని చెప్పకనే చెప్పారు. ఈ ఏక్ హై తో సేఫ్ హై నినాదం వెనుక ఉద్దేశ్యాలు అర్థం కావడానికి ఇంకా ఏం కావాలి? ప్రజలు ఇదంతా చూడడం లేదా? ఇది దేశసమైక్యత కోసం, వివిధ సముదాయాల మధ్య సమైక్యత కోసం నిజాయితీగా చెప్పిన మాటగా ఎవరైనా నమ్మగలరా?

భ్రమల్లో ఉండడం మంచిది కాదు. భిన్నత్వంలో ఏకత్వం భారతదేశ విశిష్టత. భిన్నత్వంలో ఏకత్వాన్ని మరో రకంగా ఈ నినాదం ప్రకటిస్తుందని ఎవరైనా భావిస్తుంటే అంతకన్నా అవివేకం మరొకటి ఉండదు. ఏక్ హై తో సేఫ్ హై, బటేంగేతో కటేంగే నినాదాల వెనుక ఉద్దేశ్యం ఒక్కటే. ఒక సముదాయానికి వ్యతిరేకంగా మరో సముదాయంలో భయాన్ని సృష్టించడం. ఆ సముదాయం వల్ల ప్రమాదం ఉందనే ఆందోళనను సృష్టించడం. అంటే మతం ప్రాతిపదికన ఒక సముదాయాన్ని ఏకం కావాలని పిలుపునివ్వడం.

బీజేపీ ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ఏమన్నాడో విన్నారు కదా. బీజేపీ ఓడిపోతే ఇర్ఫాన్, అన్సారీలు తిల్కా మాంఝీ, నీలాంబర్, పితాంబర్, బిర్సాముండాల భూమిని దోచుకుంటారన్నాడు. ఇది విద్వేష ప్రసంగం కాదా. ఎన్నికల కమిషన్ అయితే ఇలాంటి మాటలను అస్సలు పట్టించుకోవడమే లేదు. బర్రెలు దోచుకుంటారు, గొర్రెలు దోచుకుంటారు, మంగళసూత్రాలు లాక్కుంటారనే మాటలు ఎలాంటి విద్వేషాగ్నికి ఆజ్యం పోస్తున్నాయి.

ప్రధాని మోడీ ప్రకారం కాంగ్రెస్ విభజన రాజకీయాలు చేస్తోంది. యస్సీ, యస్టీ, ఓబీసీలను వేరు చేస్తోంది. కాని ఇది నిజమా? దేశంలో కులగణన జరిగితే నష్టమేమిటి? కులగణన జరిగితే దేశసమైక్యతకు నష్టమా? బీహారులో నితీష్ కుమార్ కులగణన చేయించాడు. బీహారులో ఏమన్నా ప్రమాదకరమైన పరిస్థితులు తలెత్తాయా? నితీష్ కుమార్ కులగణన చేయించడం ద్వారా యస్సీ,యస్టీ,ఓబీసీలను వేరు చేశాడా? అలాగయితే బీజేపీ ఇప్పుడు నితీష్ కుమార్‌తో కలిసి ఎందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దేశంలో యస్సీ, యస్టీల జనగణన జరుగుతోంది. ఓబీసీల గణన జరగడం లేదు. ఓబీసీ కులగణన జరిగినంత మాత్రాన దేశం ముక్కలైపోతుందా? బీహారులో కులగణన జరిగింది కదా? బీహారు వేర్పడిందా? కులగణన తర్వాత కూడా బీహారులో బీజేపీ, నితీష్ కుమార్ చెట్టాపట్టాలేసుకుని తిరగడం లేదా?

దేశంలో పదేళ్ళుగా మోడీ ప్రధానిగా ఉన్నారు. కాని ఎన్నికలొచ్చినప్పుడు ప్రధానిగా మోడీ, బీజేపీ ప్రభుత్వం చేసిన పనేమిటో, సాధించిన విజయాలేమిటో ఎవరూ చెప్పరు. కేవలం మతతత్వ నినాదాలు, చిచ్చుపెట్టే ప్రసంగాలు మాత్రమే ముందుకు వస్తాయి. ప్రజలు ఇవన్నీ గమనించడం లేదా? ప్రతి ఎన్నికల్లోను ఇలాంటి నినాదాలు, ఇలాంటి ప్రసంగాలు చేసి చిచ్చుపెట్టే ప్రయత్నాలు చేస్తున్న వారి ఉద్దేశ్యాలను పసిగట్టడం లేదా? ఇలాంటి మతతత్వ రాజకీయాలను ప్రజలు ఇంకెంత కాలం భరిస్తారు?

మహారాష్ట్రలో మహాయుతి ప్రభుత్వం ఏర్పడిన కొన్ని నెలల తర్వాత మహారాష్ట్ర నుంచి మూడు పెద్ద ప్రాజెక్టులు గుజరాత్‌కు తరలి పోయాయి. ఉద్ధవ్ ఠాక్రే ఈ సమస్యలన్నీ తన ఎన్నికల ప్రచారంలో ప్రస్తావిస్తున్నారు. గుజరాత్, మహారాష్ట్రల్లో పరిశ్రమల గురించి చర్చ ఎందుకు జరగడం లేదు?

ఇప్పుడు ఓట్ జిహాద్ అనే కొత్త పదం కూడా ప్రచారంలో పెడు తున్నారు. బీజేపీ ఫలానా ప్రాంతాల్లో ఓడిపోడానికి కారణం ఒక ప్రత్యేక సముదాయమనే వాదన ఒకటి ప్రచారంలోకి వస్తోంది. బీజేపీ ఓడిపోడానికి ఒక ప్రత్యేక సముదాయమే కారణమా? బీజేపీ ఓటమి వెనుక ఇతర కారణాలేవీ ఉండవా? అయోధ్యలో ఎందుకు ఓడిపోయారు? అక్కడ కూడా ప్రత్యేక సముదాయం వల్లనే ఓడి పోయారా? బెనారస్‌లో ప్రధాని మోడీకి ఓట్లు ఎందుకు తగ్గి పోయాయి? అక్కడేమైనా ఓట్ జిహాద్ జరిగిందా? దేవేంద్ర ఫడ్నవిస్ బహిరంగంగా ఓటు జిహాద్ అంటూ విద్వేష ప్రచారం చేశాడు.

ఇలాంటి ప్రసంగాలే బీజేపీకి ఓట్ల వాన కురిపిస్తున్నాయా? ప్రజలు తమ జీవితాల గురించి, అధిక ధరల గురించి, నిరుద్యోగం గురించి, తమ సమస్యల గురించి ఆలోచించకుండా ఈ విద్వేష ప్రసంగాల వరదల్లో కొట్టుకుపోతూ ఓటేస్తున్నారా? లవ్ జిహాద్, ల్యాండ్ జిహాద్, థూక్ జిహాద్ … ఇలా ఎవరేం చెబితే అది నమ్మేసే వాతావరణమే ఉందా?

లవ్ జిహాద్ గురించే మాట్లాడదాం. లవ్ జిహాద్ కేసులేమైనా ఉన్నాయా? లవ్ జిహాద్ ఎక్కడైనా ఉన్నట్లు ఆధారాలున్నాయా? గణాంకాలున్నాయా? ఎక్కడా లేని సమస్యను బూచీగా చూపించి భయపెడుతున్న రాజకీయాలను ప్రజలు గుర్తించడం లేదా? ముంబయిలో యోగీ ఆదిత్యనాథ్ పర్యటనకు ముందు బటేంగేతో కటేంగే అనే పోస్టర్లు వెలిశాయి. ముంబయిలో మరో సమస్యేదీ లేదా? బీజేపీ మిత్రుడిగా ఉన్న అజిత్ పవార్ మహారాష్ట్రలో ఇలాంటి రాజకీయాలు నడిచేది లేదని అన్నాడు. కాని ఆయనకు కూడా ఏక్ హై తో సేఫ్ హై వంటి ప్రకటనలపై అభ్యంతరమేమీ లేదు. జాతివ్యతిరేకులు దేశాన్ని ముక్కలు చేయాలనుకుంటున్నారని, అర్బన్ నక్సల్స్ ను దేశం గుర్తించాలని స్వయంగా మోడీ అన్నారు. ఎప్పటి వరకు ఈ భ్రమాత్మక ప్రసంగాలను ప్రజలు భరిస్తారు. మహారాష్ట్రలో నవాబ్ మలిక్‌కు దావూద్ ఇబ్రాహీంకు సంబంధాలున్నాయనే ఆరోపణలు వచ్చాయి. ఆయన్ను జైలుకు కూడా పంపించడం జరిగింది. కాని అజిత్ పవార్ పార్టీ ఆయనకు సీటు ఇచ్చింది. ఆయన ఎన్నికల్లో పోటీ చేస్తున్నాడు. అజిత్ పవార్ బీజేపీకి మిత్రుడు. జాతి వ్యతిరేక శక్తులతో సంబంధాలున్నాయని ఆరోపణలకు గురైన వ్యక్తి బీజేపీ మిత్రపక్షం టిక్కెట్టుపై పోటీ చేస్తున్నాడు. అంటే అర్ధమేమిటి? ఈ రోజు జాతివ్యతిరేకి అని ఆరోపణలకు గురైన వ్యక్తి రేపు దేశభక్తుల పార్టీలో చేరినా ఆశ్చర్యం లేదు. అవినీతి కుంభకోణాల్లో మునిగిపోయిన నేత అవినీతివిముక్త వాషింగ్ మెషిన్ ద్వారా శుభ్రపడి దేశభక్తపార్టీలో చేరిపోవడం మనం చూస్తూ వస్తున్నాం. స్వయంగా ప్రధాని మోడీ నవాబ్ మలిక్‌పై దాడి చేశారు. ఇప్పుడేం జరుగుతోంది?

ప్రజల సమస్యలను పక్కదారి పట్టించి. అసలు సమస్యలే కాని వాటిని సమస్యలుగా చూపించి రాజకీయాలు చేయడం ఎప్పటి నుంచో కొనసాగుతూ వస్తోంది. ఎంతకాలం ప్రజలు భరిస్తారన్నదే ప్రశ్న. పదేళ్ళుగా బీజేపీ చెబుతూ వస్తున్నది ఇదే. ఈ పదేళ్ళలో ఈ విషయంలో చేసిందేమిటో మాత్రం ఎన్నడూ చెప్పలేదు. అర్బన్ నక్సల్స్ విషయంలో రుజువులు సంపాదించి దేశానికి చూపించారా? జాతివ్యతిరేక శక్తులపై రుజువులు సంపాదించి దేశానికి చూపిం చారా? కశ్మీర్‌లో సాధించిందేమిటో దేశానికి చెప్పారా? అవినీతిని అంతం చేశారా? నోట్లరద్దుతో సాధించిందేమిటి?

ప్రజల్లో ఒక సముదాయం పట్ల మరో సముదాయంలో భయాన్ని సృష్టించే ఈ రాజకీయాలను ప్రజలు అర్ధం చేసుకోవాలి. ప్రతి ఎన్నికలోను అదే భయాన్ని కొత్త కొత్త పద్ధతులతో ప్రజల్లో ప్రచారం చేస్తున్నారు. దశాబ్దాలుగా జరుగుతున్నది ఇదే. నినాదాలు మాత్రమే మారుతున్నాయి.

మహారాష్ట్రలో ధనంజయ్ మహాదిక్ బీజేపీ నాయకుడు. ఆయనేమన్నా డంటే, ప్రభుత్వ పథకం లడ్కీ బహిన్ యోజనా ద్వారా 1500 రూపాయల ప్రయోజనం పొందిన మహిళ ఎవరైనా సరే కాంగ్రెసు ర్యాలీలో కనబడితే ఫోటో తీసి పంపండి, వాళ్ళ సంగతి చూస్తా నన్నాడు. ప్రభుత్వ పథకం ద్వారా ప్రయోజనం పొందిన వాళ్ళంటే, బీజేపీ ద్వారా ప్రయోజనం పొందినవాళ్ళని అర్ధమా? ప్రభుత్వ పథకాల ద్వారా ప్రయోజనం పొందిన వాళ్ళు ప్రతిపక్ష ర్యాలీలో పాల్గొనడం నేరమా? ఈ మాటలకు అర్ధమేమిటి?ఉజ్వల గ్యాస్ సిలిండర్ తీసుకుంటే ఓటు వేస్తామని గ్యారంటీ ఇవ్వాలా? ప్రతిపక్ష ర్యాలీల్లో పాల్గొనకూడదా? ఈ పథకాల ద్వారా ఓటర్లను బ్లాక్ మెయిల్ చేసే కొత్త పద్ధతి కనిపెట్టారా? తర్వాత తన మాటలకు ఆయన విచారం వ్యక్తం చేశాడన్నది వేరే విషయం. ఏది ఏమైనా దేశంలో రాజకీయాలు ఏ స్థాయికి చేరుకున్నాయో కాస్త ఆలోచిస్తే అర్ధం కాని విషయం కాదు.

భారత రాజకీయాలను పరిశీలిస్తే ఒకసముదాయాన్ని విలన్‌గా మార్చి ప్రచారం చేస్తే చాలు ఓట్ల వాన కురుస్తుందన్న వాతావరణం దట్టంగా అలుముకుని ఉంది. కాంగ్రెస్ నేతలు కూడా ఈ వాతా వరణంలో తమ పాత్ర పోషిస్తూనే ఉన్నారు. హిమాచల్ ప్రదేశ్‌లో, మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ నేతల వైఖరి దీనికి సాక్ష్యం.

కేవలం మతతత్వ వ్యాఖ్యలతో ఎన్నికలు గెలవగలమన్న ధీమా నేతల్లో వచ్చేస్తే ఇక నేతలు ప్రజాసంక్షేమం కోసం ఎందుకు పనిచేస్తారు? ప్రజలు ఆలోచించవలసిన ప్రశ్న ఇది. ✤

# బహుముఖ ప్రజ్ఞాశాలి మౌలానా ఆజాద్



మదీహా అర్జుమంద్

భారతదేశ మొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్. పూర్తిపేరు సయ్యిద్ అబుల్ కలాం గులాం మొహియుద్దీన్ అహ్మద్ ఆజాద్. తండ్రిముద్దుగా ఫిరోజ్ బఖ్త్ అని పిలుచుకునేవారు. అబుల్ కలాం అనేది బిరుదు. కలం పేరు ఆజాద్. 1888 నవంబర్ 11వ తేదీన సౌదీ అరేబియాలోని మక్కాలో ఒక సంపన్న ధార్మిక కుటుంబంలో జన్మించారు. ఆలియా బేగం, మౌలానా ఖైరుద్దీన్ అహ్మద్‌లు తల్లిదండ్రులు. ఆజాద్ గొప్పస్వాతంత్ర్య సమర యోధుడు. తత్వవేత్త, సాహితీవేత్త, విద్యావేత్త, రాజకీయ వేత్త, ఆధునిక భారత విద్యావ్యవస్థ నిర్మాత. అనేక భాషల్లో ఆయన నిష్ణాతుడు.

1940 నుండి 1946 వరకు భారత జాతీయ కాంగ్రెస్‌కు అధ్యక్షులుగా ఉన్నారు. 35 సంవత్సరాల అతి పిన్నవయసులోనే ఆయన జాతీయ కాంగ్రెస్‌కు అధ్యక్షత వహించారు. 1947 నుండి 52 వరకు విద్యాశాఖమంత్రిగా, 1952 నుండి 58 వరకు విద్యా, ప్రకృతి వనరులు, శాస్త్ర సాంకేతిక మంత్రిగా, 1956లో యునెస్కో అధ్యక్షునిగా పని చేసిన మౌలానా ఆజాద్ అసమానమైన రీతిలో విద్యాభివృద్ధికి కృషిచేసారు. విద్యా రంగంలో శాస్త్ర, సాంకేతికతను పెంపొందించడానికి విశేష కృషి చేశారు.

1951లో ఖరగ్‌పూర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ టెక్నాలజీని స్థాపించిన ఘనత మౌలానా ఆజాద్‌దే. ఆయన గౌరవార్థం దేశంలో అనేక విద్యాసంస్థలకు ఆయన పేరు పెట్టారు. 1921లో సహాయ నిరాకరణ, 1930లో శాసనోల్లంఘన, 1942 లో క్విట్ ఇండియా ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించారు. పది సంవత్సరాలకు పైగా జైలు జీవితం అనుభవించారు. 1890 లో ఆయన కుటుంబం కలకత్తా వచ్చి స్థిరపడింది. ప్రాథమిక విద్య ఇంటి దగ్గరే నేర్చుకున్నారు.

పన్నెండేళ్ళ వయసులోనే ఆయనకు ప్రత్యేకంగా రీడింగ్ రూమ్, సొంత లైబ్రరీ ఉండేవి. మొదట పార్శీ, అరబీ విద్యలు ఔపోసన పట్టారు. తరువాత ఫ్రాన్స్ , ఇంగ్లీషు గ్రంధాల విస్తృత అధ్యయనం ప్రారంభించారు. మౌలానా విభిన్న రంగాల్లో అవగాహన, ఆసక్తి, నైపుణ్యం కలిగిన బహుముఖ ప్రజ్ఞాశాలి. పండిట్ నెహ్రూ మౌలానా రాజకీయ, సామాజిక పరిణతి గురించి గొప్పగా ప్రశంసించారు. మౌలానా నిష్ఠాగరిష్ఠుడైన ధార్మిక పండితుడు. పరమత సహనం కలిగిన వారు. నిఖార్సయిన మానవతావాది. హిందూ – ముస్లింల ఐక్యతను పెంపొందించడమే ధ్యేయంగా 'అల్ – హిలాల్' పత్రికను స్థాపించారు. అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం ఆ పత్రికను నిషేధించడంతో 'అల్ – బలాగ్' పేరుతో మరో పత్రికను ప్రారంభించారు. ఆయన మొట్టమొదట రాసిన గజల్ 'అర్మగానె ఫర్?' పత్రికలో ప్రచురితమైంది. తరువాత లక్నో నుండి వెలువడే 'ఖుదంగె నజర్', 'పయామెయార్' పత్రికల్లో ఆయన కవిత్వం క్రమం తప్పకుండా ప్రచురితమయ్యేది. ఆయన మొట్టమొదట ప్రారంభించిన పత్రిక 'లిసాన్ – ఒ సిద్'. 'నైరంగ్ ఆలం' పేరుతో ఓ సాహిత్య పత్రికను కూడా ప్రారంభించారు. తర్జుమానుల్ ఖురాన్ పేరుతో పవిత్ర ఖుర్ఆన్ గ్రంథానికి వ్యాఖ్యానం రాశారు. అల్ హిలాల్, తర్జుమానుల్ ఖురాన్, అల్ బలాగ్ పత్రికలను స్వయంగా స్థాపించారు. గుబార్ – ఎ ఖాతిర్, ఇండియా విన్స్ ఫ్రీడం, అల్ బయాన్, అల్ బసాయిర్, జామిఉష్షవాహిద్, ఖిలాఫత్, జజీరుల్ అరబ్, ఖుత్బాత్ గ్రంధాలు రచించారు. అల్ మతీన్, వకీల్, జమీందార్, హందర్ద్, ముస్లిం గెజిట్, అల్ హాకిమ్, అల్ హఖ్, కామ్రేడ్ లాంటి ప్రముఖ పత్రికలకు వ్యాసాలు రాశారు. భారత్, పాకిస్తాన్ విభజనను తీవ్రంగా వ్యతిరేకించారు. జిన్నాతో విభేధించారు. మౌలానా ఆజాద్ మరణానంతరం 1992లో భారతదేశ అత్యున్నత పురస్కారమైన భారతరత్న ఆయనకు లభించింది. లౌకికవాదా నికి, జాతీయ సమైక్యతకు ప్రతీకగా నిలిచిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ 1958 ఫిబ్రవరి 22 వ తేదీన ఢిల్లీలో తుదిశ్వాస విడిచారు. మౌలానా గౌరవార్థం ఆయన పుట్టిన రోజును జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకోవాలని 2008, సెప్టెంబరు 11న కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ప్రకటించింది. అదే రోజు జాతీయ మైనారిటీ సంక్షేమ దినోత్సవంగాను జరుపుకుంటారు.

# ఒక చిన్న మాట!

**మలిక్**

బాగానే చెప్పావు "చిన్న మాటే" అని
అనుకోకుండా వచ్చేసిందని...
మాట ముఖ్యం కాదు నా ప్రాణ మిత్రమా!

నీవు చూసే ఉంటావు మనుగడ సతతం
అణువణువు నుండి క్షణ క్షణం నుండి
సమసిపోయిన సమయ కుప్పల నుండి
మాసిపోయిన ఘటనల పేలికల నుండి
ఎన్నెన్నో బింబాలు ఎన్నెన్నో చిత్రాలు
ఎన్నెన్నో రూపాలు అర్థించి ఏరుకుని
మోసుకు మోసుకు తెస్తుంది!
ఒక్క మానవుణ్ణి రూపుదిద్దుతుంది!!

చిటికెడు బూది తీసి ఓ సారి
– చిటికెడు బూది విలువెంత! –
ఆచితూచి కాస్త నిమ్మళంగా
నిర్మలమయిన గాలిలోకి
మెల్లిమెల్లిగా వదలి చూడు
ఎటు వైపునకు పోతుందో
గాలి వాటమెటు చూపుతుందో...

బాగానే చెప్పావు మాట చిన్నదే ...
అనుకోకుండానే వచ్చేసింది... కానీ
మాట ముఖ్యం కాదు నా ప్రాణ మిత్రమా!
మనిషి ఆంతర్యానికి అది అద్దం పడుతుంది!!



# పిల్లల పెంపకం... పేరెంట్స్‌కు సూచనలు!!

**- నుస్రత్ ఫాతిమా**

**పిల్లలను క్రమశిక్షణగా పెంచాలని, మంచి విద్యాబుద్ధులు నేర్పాలని, సభ్యతా సంస్కారాలు నేర్పాలని కాస్తోకూస్తో ధార్మిక జ్ఞానం ఉన్న అమ్మానాన్నలందరికీ ఉంటుంది.** పిల్లలు పెరిగి పెద్దవారయి ప్రయోజకులయితే చూడాలన్నది కన్నవాళ్ల కల. పిల్లల్ని ఎలా పెంచాలి? వారికి క్రమశిక్షణ ఎలా అలవర్చాలి? అన్నదే అసలైన సవాలు. చాలామంది తల్లిదండ్రులు సాధారణంగా తమ పిల్లలు ఐదేళ్లకో, పదేళ్లకో చేరాక క్రమశిక్షణ గురించి, సుశిక్షణ గురించి తెలిసిన వారితో చర్చిస్తుంటారు. పిల్లల్ని సన్మార్గంలో పెంచేదెలా అని అడుగుతుంటారు. కానీ పిల్లల్ని క్రమశిక్షణగా పెంచే వయస్సు పిల్లలు పుట్టకముందు నుంచే మొదలవుతుందన్న విషయం ఎంతమందికి తెలుసు? మన పిల్లల శిక్షణకు తొలిమెట్టు మనకు పుట్టబోయే సంతానం తల్లి ఎంపికతో మొదలవుతుంది. పిల్లలు పుట్టాక శిక్షణ మొదలవ్వదని ఇస్లామ్ బోధనలు చదివితే బోధపడుతుంది. శిక్షణ అన్నది పిల్లలు పుట్టకముందే కాబోయే భాగస్వామి ఎంపికతో మొదలవ్వాలి. మంచి సౌశీల్యురాలైన, సదాచార సంపన్నురాలైన భార్య ఎంపికతో మొదలవుతుంది. తల్లిదండ్రులు తమ కుమారుడికి పెళ్లి సంబంధాలు చూసేటప్పుడు సుగుణాల రాశి అయిన కోడలి కోసం నిరీక్షించాలి. ఒకసారి ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) దగ్గరకు ఒక యువకుడి వివాదం వచ్చింది. ఒక తండ్రి తన  కొడుకును లాక్కుంటూ ఖలీఫా ముందుకు తీసుకువచ్చాడు. “అమీరుల్ మోమినీన్ మా అబ్బాయి నా హక్కులు నెరవేర్చడం లేదు. దయచేసి మా అబ్బాయికి కాస్తంత మీరైనా నచ్చజెప్పండి” అని ఆ తండ్రి రోదిస్తూ మొరపెట్టుకున్నాడు. అమీరుల్ మోమిన్ హజ్రత్ ఉమర్ ఏదో చెప్పబోతుండగా ఆ యువకుడు అడ్డు తగిలి “ఖలీఫా గారు మానాన్నపై ఉన్న నా హక్కులేమిటో ముందు తేల్చండి” అని నిలదీశాడు. అప్పుడు అమీరుల్ మోమినీన్ “తల్లిదండ్రులపై పిల్లల హక్కును ఇలా వివరించారు: పిల్లల కోసం మంచి తల్లిని

ఎంపిక చేయాలి, పుట్టిన పిల్లలకు మంచిపేరు పెట్టాలి, మంచి విద్యాబుద్ధులు బోధించి సరైన శిక్షణతో పెంచాలి'' అని వివరించారు. ''ఖలీఫా గారూ మానాన్న ఈ మూడు హక్కులనూ నెరవేర్చలేదని తనకు జరిగిన అన్యాయాన్ని వివరించాడు. ఖలీఫా గారు యువకుడి మాటలు విని పిల్లల హక్కులు నెరవేర్చకుండా తమ హక్కులు కావాలను కోవడం అవివేకమే అవుతుందని చెప్పారు. పిల్లల శిక్షణ దశ పిల్లలు పుట్టకముందు నుంచే ప్రారంభమవుతుందని, సతీమణి, ఇంటికి కాబోయే కోడలి ఎంపికతోనే మొదలవుతుందని హజ్రత్ ఉమర్ (రజి) తెలిపారు. సుగుణాల రాశి అయిన అమ్మాయి ఇంటికి కోడలిగా వస్తే ఆమె తనకు పుట్టే పిల్లల్ని ఎంతో క్రమశిక్షణగా పెంచుతుంది. అమ్మాయికి వరుడిని ఎంపిక చేసినా, అబ్బాయికి వధువును ఎంపిక చేసినా ధార్మిక భావాలను చూడాలన్నది ప్రవక్త హితవు. మొదటి మెట్టే సరిగా ఎక్కకపోతే ఇక రెండో మెట్టు సరిగా వేయలేము. కానీ మనం మన పిల్లల వివాహం దగ్గరికొచ్చేసరికి ధార్మిక భావాలను పెద్దగా పట్టించు కోము. అమ్మాయి కానీవ్వండి అబ్బాయి పెళ్లి కానివ్వండి ప్రాపంచిక విషయాలకే పెళ్లిలో పెద్దపీట వేస్తాము. సదాచార సంపన్నురాలైన భార్యే ఈ ప్రపంచంలో విలువైనది. ఆదర్శ భావాలున్న దంపతులకు మంచి సంతానమే కలుగుతుంది. ఆలూమగలిద్దరూ కలిసి పిల్లల్ని సౌశీల్యానికి ప్రతిరూపంగా పెంచుతారు. క్రమశిక్షణకు మారుపేరుగా తీర్చిదిద్దుతారనడంలో సందేహం లేదు. ఇద్దరిలో ఏ ఒక్కరిలో దుర్గుణాలున్నా ఆ పుట్టబోయే సంతానం సరిగా ఉండదు. సంతానానికి సరైన విద్యాబుద్ధులు ఒంటబట్టవు. వివాహ బంధంతో ఒక్కటయ్యే జంట సౌశీల్యవంతులైన సంతానం కోసం అల్లాహ్ ను వేడుకోవాలి. ఇది పిల్లల శిక్షణలో రెండో మెట్టు. హజ్రత్ ఇబ్రాహీమ్ సంతానం కోసం చేసిన వేడుకోలు మనకు ఆదర్శనీయం. ''ప్రభూ! నాకు శీలవంతుడైన ఒక కుమారుణ్ణి ప్రసాదించు.'' (ఖుర్ఆన్ 71:100) కానీ చాలామంది తమకు పండంటి మగబిడ్డే పుట్టాలని వేడుకుంటారు. ఇది అనుచితమైన పద్ధతి. పుట్టబోయేది అమ్మాయి అయినా, అబ్బాయి అయినా సౌశీల్యవంతుడు కలగాలనే వేడుకోవాలన్నది ఖుర్ఆన్ ఉద్బోధ. పిల్లలు పుట్టిన వెంటనే వాళ్లను ఇస్లామ్ సంప్రదాయ పద్ధతిలో ఈ ప్రపంచంలో స్వాగతించాలి. పిల్లలు పుట్టాక ధార్మికంగా, నిష్ఠాగరిష్టలున్న వారివద్దకు తీసుకెళ్లి వాళ్ల ద్వారా ఎండు ఖర్జూరంతో నోరు తీపి చెయ్యాలి. ఏడోరోజు వెంట్రుకలు గొరిగించి అకీకా చేయాలి. గొరిగించిన వెంట్రుకలకు సరిసమానంగా బంగారం లేదా వెండి తూచి వాటికి సరితూగే డబ్బులను దానం చేయాలి. బిడ్డకు మంచిపేరు పెట్టాలి. కానీ చాలామంది ముస్లిముల ఇళ్లల్లో పిల్లలు పుడితే ఇస్లామ్ సంప్రదాయాలకు విరుద్ధంగా వాళ్లను స్వాగతిస్తారు. ఆరో రోజు ఛటీ అనే కార్యక్రమాన్ని అట్టహాసంగా చేస్తారు. ఆ తరువాత ఛిల్లా అని నలభయ్యో రోజును ఘనంగా జరుపుతారు. ఇవన్నీ ఇస్లామ్ సంప్రదాయాలకు విరుద్ధమైనవి. ఏడో రోజు అకీకా చేయాలని చెబితే ఎన్నో వంకలు పెట్టేవాళ్లే ఛిల్లా వేడుక శుభలేఖలు కూడా ముద్రించి బంధుమిత్రులను ఆహ్వానించి పెద్ద ఫంక్షన్ హాళ్లలో గొప్పగా వేడుక జరుపుతారు. ఇస్లామ్, ప్రవక్త సంప్రదాయాలకు విరుద్ధమైన పనులను చేసి తమ పిల్లలు మాట వినడంలేదని తల్లిదండ్రులు నెత్తీనోరు బాదుకోవడంలో అర్థం లేదు.

పేరు పెట్టే విషయంలోనూ చాలామంది తల్లిదండ్రులు అతిశయానికి పోతుంటారు. వినూత్నానికి పోయి తప్పులో కాలేస్తుంటారు. అల్లాహ్ పేర్లు వచ్చేలా, ప్రవక్తల, సహాబాల, పేర్లను పురాతన పేర్లుగా కొట్టిపారేస్తుంటారు. అల్లాహ్‌కు నచ్చిన పేర్లలో అబ్దుల్లాహ్, అబ్దుర్రహ్మాన్. 99 అల్లాహ్ పేర్లు, పాతికమంది ప్రవక్తల పేర్లు పెట్టడం వల్ల ఆ ప్రభావం పిల్లల వ్యక్తిత్వంపై కూడా ఉంటుంది. సల్మాన్ అనే పేరు పెడితే సల్మాన్ ఫార్సీ వ్యక్తిత్వం లాంటి గొప్ప సుగుణాలు అలవడతాయి. నాకు తెలిసిన ఒక నవముస్లిమ్ అబ్దుల్ ముమీత్ అని నామకరణం చేసుకున్నాడు. 'ముమీత్ అంటే మృత్యువు ప్రసాదించేవాడనే అర్థం వస్తుంది కదా నీకు భయం లేదా' అని అడిగితే ''మరణం తరువాత అల్లాహ్‌నే కదా కలిసేది'' అని సమాధనం చెప్పాడు. పిల్లలకు ఏడోరోజు అకీకా చేయడమైనా, మంచిపేరు పెట్టడమైనా, తల్లిపాలు పట్టడం ఇవన్నీ పిల్లల హక్కులు. ఇవే పిల్లల శిక్షణకు సోపానాలు. తల్లిపాలు పిల్లలకు అన్నిరకాలుగా మేలే చేస్తాయి. దీనివల్ల తల్లీబిడ్డల మమతానురాగాలు ఇనుమడిస్తాయి. అమ్మ వెచ్చని ఆత్మీయ స్పర్శలో పిల్లలు పాలుతాగి పెద్దయితే ఆ పిల్లలు పెద్దయి ప్రేమకు ప్రతిరూపంగా మారుతారనడంలో మరోమాటకు తావులేదు. ఈ మహత్యం తల్లి పాలలోనే ఉంటుంది కానీ డబ్బా పాలల్లో ఉండదు. దైవ నామస్మరణ చేసుకుంటూ పాలుపట్టాలి.

### పిల్లల శిక్షణ మూడు దశల్లో జరుగుతుంది

ఇంట్లో మొదటిదశ శిక్షణ జరిగితే బడిలో రెండో దశ, సమాజంలో మూడో దశ శిక్షణ జరుగుతుంది. రెండేళ్లు దాటిన పిల్లలు

అప్పుడప్పుడే మాటలాడటానికి ప్రయత్నిస్తుంటారు. వచ్చీరాని మాటలతో పిల్లలు పలికే ముద్దు ముద్దు మాటలతో ఇంట్లో వాళ్లంతా మురిసిపోతారు. ఇప్పటిదాకా పరోక్ష శిక్షణ జరిగితే ఇక్కడి నుంచి ప్రత్యక్ష శిక్షణ మొదలవుతుంది. పిల్లలు చుట్టూ జరుగుతున్న ప్రతీ విషయాన్ని ఎంతో పరిశీలిస్తుంటారు. ఏదైతే చూస్తారో వాటినే తమ నోటిద్వారా చెప్పేందుకు, పలికేందుకు ప్రయత్నిస్తుంటారు. పాలుతాగే పసిప్రాయం నుంచి ఏదైతే వింటూ వచ్చారో వాటినే పలుకుతారు. అందుకే పిల్లలు మాట్లాడే వయస్సుకు వచ్చేసరికి 'లాయిలాహ ఇల్లల్లాహ్' కలిమాను నేర్పాలి. ఎవరి నోటిద్వారా తొలి మాట లాయిలాహ ఇల్లల్లాహ్ వచ్చిందో, ఎవరి చివరి పలుకు లాయిలాహ ఇల్లల్లాహ్ వచ్చిందో వాళ్లు జయం సాధించినట్లే. అలాకాకుండా పసిపిల్లల్ని టీవీలముందు పడుకోబెట్టి, సినిమాలు, పాటలు వింటూ పాలు త్రాపిస్తే అలాంటి పిల్లలు ఎలా ఉంటారో వేరే చెప్పనక్కరలేదు. అలాంటి పిల్లలు మాట్లాడటం మొదలెట్టగానే ఏం మాట్లాడుతారో మనం తరచూ చూస్తూనే ఉంటున్నాము. ముద్దుమాటలు చెప్పే పిల్లల నోట తిట్లు, దుర్భాషను నేర్పి వాళ్లు అలా మాట్లాడుతుంటే గొప్పగా చెప్పుకునే వారూ లేకపోలేదు. పెరిగిపెద్దయ్యాక పిల్లలు అలానే దుర్భాషలాడి ఇంటిమీదకు గొడవలు తీసుకువచ్చినప్పుడు ఆ తల్లిదండ్రులు తల పట్టుకోవాల్సి వస్తుందన్న విషయాన్ని గమనించరు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా మారుతుంది ఇలాంటి పేరెంట్స్ పరిస్థితి. తల్లి ఒడి మొదటి బడి అని ఊరకే అనలేదు. తల్లి ఒడిలో ఏమి నేర్చుకుంటారో జీవితాంతం అదే అలవర్చుకుంటారు. అమ్మ బడిలో నేర్చుకునేదే జీవితాంతం ఉంటుంది. ఆ బడి మంచిదైతే పిల్లలు వృద్ధిలోకి వస్తారు. ప్రయోజకులవుతారు. తల్లిదండ్రులకు మంచిపేరు తెచ్చిపెడతారు.

## ఇంట్లో ఒకరికి మించి ఎక్కువ సంతానముంటే అప్పుడేం చేయాలి?

ఒకరికి మించి ఎక్కువ సంతానం కలిగితే పిల్లల మధ్య సమ న్యాయం పాటించాలి. ఇద్దరూ లేదా అంతకంటే ఎక్కువమంది పిల్లలుంటే అందరినీ సరిసమాన దృష్టితో చూడాలి. ఒకళ్లు ఎక్కువ ఒకళ్లు తక్కువ అని కాకుండా పిల్లలందరితో నిజాయితీగా వ్యవహరించాలి. అమ్మాయి, అబ్బాయి ఉంటే అమ్మాయి పట్ల వివక్ష చూపడం, అబ్బాయికి ప్రాధాన్యతనివ్వడం ఎక్కువగా చేస్తుంటారు. చాలామంది అమ్మాయిని గవర్నమెంట్ స్కూల్లో, అబ్బాయిని ప్రైవేటు స్కూల్లో చేర్పించడం మొదలు ఇలా ప్రతీ విషయంలోనూ వివక్ష చూపుతుంటారు. ఒకవేళ ఇద్దరు మగ పిల్లలుంటే అందంగా ఉన్న పిల్లాడివైపు ఎక్కువగా మొగ్గు చూపడం జరుగుతుంది. పిల్లలు పెద్దల ప్రతీ విషయాన్ని గమనిస్తూ ఉంటారు. పెద్దల వ్యవహారశైలి పిల్లలపై తీవ్రంగా ప్రభావం చూపుతుంది. పిల్లలపట్ల వివక్ష చూపడం, ఒకరిని ఎక్కువ, ఒకరిని తక్కువ చూసి చూడడం ఇస్లామ్ ధర్మం అనుమతించదు. ఇలాంటి పిల్లల మధ్య పగ, ప్రతీకారం పెరుగుతుంది. ఇలాంటి పిల్లల్లో సరైన శిక్షణ జరగదు. ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే వాళ్లందరినీ సమదృష్టితో చూడాలన్నది ప్రవక్త బోధన. పిల్లలపట్ల భేదభావం చూపరాదన్నది ప్రవక్త ఉద్బోధ.

పిల్లల శిక్షణలో తల్లిపాత్ర అనిర్వచనీయమైనది. పిల్లల బాగోగులు, శిక్షణ బాధ్యత తల్లిపై ఉంది కాబట్టే మహిళలకు సంపాదన, ఇంటి పోషణ బాధ్యతలనుంచి ఇస్లామ్ తప్పించింది. పిల్లలు తండ్రికంటే కూడా తల్లినే అనుసరిస్తారు. అమ్మనే అనుకరిస్తారు. దీనికి నూహ్ ప్రవక్త కుమారుడే ప్రత్యక్ష నిదర్శనం. నూహ్ ప్రవక్త భార్య ఇస్లామ్ స్వీకరించలేదు కాబట్టి కుమారుడు కూడా ఇస్లామ్ స్వీకరించలేదు. పిల్లలకు ఏమైనా కావాలన్నా ముందు తల్లికే చెప్పుకుంటారు. తండ్రికి చెప్పాలన్నా తల్లితోనే చెప్పిస్తారు. అందుకే పిల్లల పెంపకం, వాళ్ల శిక్షణ విషయంలో తల్లిపాత్ర ఎంతో కీలకమైనది. పిల్లల పెంపకం విషయంలోతల్లిని ప్రశ్నించడం జరుగుతుందని, సరైన పెంపకంలో పెంచని తల్లులు స్వర్గ సువాసనలను కూడా ఆస్వాదించలేరన్నది ప్రవక్త హెచ్చరిక.

చరిత్రలో ఆదర్శ మాతృమూర్తుల గాథలు ఎన్నో ఉన్నాయి. ఇస్మాయీల్ (అలై) తన తల్లి హజ్రత్ హాజిరా (అలై) శిక్షణ గురించి మనందరం చదువుకున్నాము. తల్లి హాజిరా ఎంత దైవ విధేయురాలో ఇస్మాయీల్ అలై) కూడా అంతే దైవవిధేయులుగా తర్ఫీదు పొందారు.

పిల్లల్ని మితిమీరి గారాబం చేయడం వల్ల పెరిగి పెద్దయ్యాక భారీ మూల్యమే చెల్లించుకోవాల్సి వస్తుంది. "బంగారు ముద్ద తినిపించినా చేదు చూపుతో చూడండి" అని ఊరకే అనలేదు. పిల్లలకు కావాల్సినవన్నీ సమకూర్చండి కానీ క్రమశిక్షణ విషయంలో రాజీపడకూడదు.

పిల్లలు ఇంటినుంచి బయటకు అడుగు పెట్టాక తండ్రి, గురువులదే బాధ్యత. తండ్రి బయటినుంచి ఇంటికి రాగానే పిల్లలు రోజంతా ఏమేం చేశారో అడిగి తెలుసుకోవాలి. పిల్లల

విషయంలో ఏదైనా ఫిర్యాదు వస్తే వాళ్లను సున్నితంగా దండించాలి. వాళ్లను హెచ్చరించాలి. మున్ముందు మరోసారి తప్పు చేయకుండా పిల్లలకు మంచీచెడులు నచ్చచెప్పాలి. నేటి తండ్రులకు హజ్రత్ ఇబ్రాహీం (అలై), లుఖ్మాన్ (అలై) పెంపకం ఆదర్శప్రాయం. ఖుర్ఆన్ తరచి చూస్తే వాళ్లు తమ పిల్లల పెంపకం ఎలా చేశారో బోధపడుతుంది.

పిల్లల పెంపకంలో మరో కీలక దశ పిల్లలు చదివే బడి. ఇంట్లో పిల్లల్ని ఎంతబాగా క్రమశిక్షణగా పెంచినా బడిలో మంచి వాతావరణం లేకపోతే పిల్లలు గాడితప్పుతారు. ధార్మిక భావాలు నూరిపోసే స్కూళ్లు నేడు చాలా అరుదుగానే ఉన్నాయి. పిల్లలకు స్కూళ్లలో ధార్మిక శిక్షణ లేకపోతే ఆ పిల్లలు పెరిగి పెద్దయ్యాక ఎలా తయారవుతారో మనం నేడు చూస్తున్నాము. స్కూళ్లల్లో జరిగే అనైతిక చేష్టలు, అత్యాచారాలు, హత్యల గురించి వస్తున్న వార్తలే దీనికి నిదర్శనం. స్కూలు ఎంపిక కూడా పిల్లల వ్యక్తిత్వంపై కీలక పాత్ర పోషిస్తుంది.

చాలా మంది పేరెంట్స్ తమ పిల్లలు చదువుల్లో ముందుండాలని పిల్లలకు ఒత్తిడికి గురి చేస్తారు. వాళ్ల చదువు కోసమే పాటుపడతారు. పిల్లల్ని ర్యాంకులు తెచ్చిపెట్టే యంత్రాలుగా భావిస్తారు. ధార్మిక విద్యాబుద్ధులను బోధించడంలో నిర్లక్ష్యం చేస్తారు. పిల్లల చదువుకోసం లక్షలకు లక్షలు డబ్బులు వెచ్చిస్తారు. కానీ ధార్మిక విద్యకోసం నయాపైసా ఖర్చుపెట్టడానికి కూడా వెనకాడతారు. స్కూళ్లలో ధార్మిక విద్య ఏర్పాటు లేకపోతే పిల్లలకు ప్రత్యేకంగా ధార్మిక విద్యను బోధించడానికి ట్యూషన్ లు ఏర్పాటు చేయాలి. ఖుర్ఆన్ పఠన విద్యను నేర్పాలి. అరబీలో సరైన ఉచ్ఛారణతో ఖుర్ఆన్ చదివించే ఏర్పాటు చేయాలి. కలిమాలు, ఇస్లామీయ జీవన సరళిని పిల్లలకు నేర్పాలి.

పిల్లల శిక్షణలో స్నేహితులు కూడా కీలకమే. పిల్లలకు ఎన్ని రకాలుగా ఎన్ని విద్యాబుద్ధులు నేర్పించినా వాళ్ల సాంగత్యం సరిగా లేకపోతే పిల్లల వెనుక పడ్డ కష్టమంతా బూడిదలో పోసిన పన్నీరే అవుతుంది. మన పిల్లల ఫ్రెండ్స్ ఎంపిక తల్లిదండ్రులే చేయాలి. పిల్లలు ఎవరితో స్నేహం చేస్తున్నారో వాళ్ల అలవాట్లు ఏమిటో ఓ కన్నేసి ఉంచాలి. పిల్లల స్నేహితులు చెడు అలవాట్లు గలవాళ్లయితే అలాంటి సాంగత్యం నుంచి పిల్లల్ని దూరం చేయండి. మనిషి తన స్నేహితుడి ధర్మంపై ఉంటాడని ప్రవక్త చెప్పారు. కనుక మంచి స్నేహితుడిని ఎంపిక చేయాలి.

పిల్లల శిక్షణలో ఆటపాటలు చాలా ప్రముఖమైనవి. పిల్లల్ని ఆటపాటలకు దూరం చేయకూడదు. శిక్షణ పేరుతో అతి పనికిరాదు. అది చేయకు, అది తినకు, అక్కడకు వెళ్లకు ఇలా ప్రతీ విషయంలో వద్దు వద్దు అనీ చెప్పడం మూలాన పిల్లల్లో ప్రతికూల భావాలు ఏర్పడతాయి. ఏమి చేయొద్దో చెప్పినప్పుడు ఏమి చేయాలో కూడా చెప్పాలి. దానివల్ల పిల్లల్లో అనుకూల భావాలు కలుగుతాయి. ప్రతీ విషయానికి ప్రత్యామ్నాయం చూపించాలి. పిల్లల మానసిక శారీరక ఎదుగుదలకు ఆటలు ఎంతో కీలకమైనవి. పిల్లల్ని ఆటపాటలకు దూరం చేసి గది నాలుగు గోడలలో బంధించడం వల్ల పిల్లల శక్తి సామర్థ్యాలు క్షీణించి పోతాయి. వాళ్లలో ఉత్సాహాన్ని పెంచాలి. సెలవురోజు పిల్లల్ని బాగా ఆడించాలి. ఎంతగా అంటే వాళ్లు అలసిపోయేదాకా. చిట్టి చిట్టి చేతులతో సోషల్ సర్వీసు చేయించాలి, చిన్న చిన్న సహాయాలు చేయించాలి. దీనివల్ల పిల్లల్లో చిన్ననాటి నుంచే సేవాభావం అలవడుతుంది. చిన్నారుల అభిరుచులకు తగ్గట్టుగా వాళ్లకిష్టమైన క్రీడలను నేర్పించాలి. శారీరక పటుత్వాన్ని కలిగించే ఆటలు నేర్పించడం మంచిది. పిల్లల మధ్య పోటీలు పెట్టాలి. ఖుర్ఆన్ పోటీలు, గేయాల పోటీలు, ఆటలపోటీలు ఇలా పలు అంశాల్లో పోటీలు పెట్టి బహుమతులు అందించి వాళ్లను ప్రోత్సహించాలి. సాయంత్రంలోగా ఫలానా దుఆ, ఫలానా ఖుర్ఆన్ సూరా నేర్చుకుంటే ఫలానా కానుక ఇస్తానని వాళ్లల్లో ఉత్సాహాన్ని కలిగించాలి.

పిల్లలు ఏడేళ్ల ప్రాయానికి రాగానే నమాజుకు తీసుకెళ్లాలి. పదేళ్ల ప్రాయానికి చేరుకున్నాక నమాజు చదవకపోతే దండించాలి. పిల్లల వస్త్రధారణ విషయంలో జాగ్రత్త వహించండి. దైవభీతి, సభ్యతా సంస్కారం ఉట్టిపడే దుస్తులనే పిల్లలకు ధరించాలి. కళ్లల్లో సిగ్గుబిడియాల కాటుక రాయాలి. ధైర్యసాహసాలను నూరిపోయండి. పిల్లల్లో గూడుకట్టుకున్న పిరికితనాన్ని దూరం చేయండి.

ఇక పిల్లలకు టీనేజ్ దశ పిల్లల శిక్షణకు చాలా కీలక దశ. పైచదువులు ముగిసిన వెంటనే ఈడొచ్చిన పిల్లలకు పెళ్లి చేయడంలో త్వరపడాలి. యువత పెడదారి పట్టడానికి ప్రధాన కారణం లైంగిక వాంఛ. నికాహ్ చేయడం వల్ల యువతలో పెచ్చరిల్లే రుగ్మతలకు అడ్డుకట్ట వేయవచ్చు. పెళ్లితో మొదలయ్యే పిల్లల శిక్షణ పెళ్లితోనే ముగుస్తుంది. అంతేగాని పిల్లల పెంపకం గుణపాఠం కాకూడదు.

# వక్ఫ్ ప్రాపర్టి అల్లాహ్ ఆస్తి



- సయ్యిద్ సాదతుల్లా హుసైనీ

అనువాదం : ఆలియా

## (విజయవాడలో 'వక్ఫ్ పరిరక్షణ' సదస్సులో చేసిన ప్రసంగం)

**అల్లాహ్‌నూ, ఆయన ప్రవక్తనూ విశ్వసించండి. ఆయన మిమ్మల్ని ఏ వస్తువులపై ఖలీఫా (ప్రతినిధి) గా నియమించాడో, వాటిలోనుండి ఖర్చు పెట్టండి. మీలో విశ్వసించి ధనం ఖర్చుపెట్టే వారికి గొప్ప ప్రతిఫలం లభిస్తుంది. (57:7)**

ఈ రోజు ఆంధ్రప్రదేశ్ చరిత్రలో, దేశ చరిత్రలో ఎంతో శుభ సందర్భం. ఇంత పెద్ద సంఖ్యలో రాష్ట్ర నలుమూలల నుండి వక్ఫ్ పరిరక్షణ కొరకు మీరంతా ఇక్కడకు విచ్చేశారు. మీరు పూర్తి ఉత్సాహంతో, స్పృహతో 'వక్ఫ్ అమెండ్మెంట్ బిల్'ను ముస్లింలు ఎట్టి పరిస్థితులలోనూ స్వీకరించరు అని మీరు ప్రకటించారు. 5 కోట్ల సంఖ్యలో మీరు మీ ఈ-మెయిల్ ద్వారా ప్రభుత్వం వరకు మీ నిరసనను చేరవేశారు. ఇప్పుడు దేశ నలుమూలలా పెద్దపెద్ద కార్యక్రమాలలో ఇదేవిధంగా వేల సంఖ్యలో ముస్లింలు సమావేశం అవుతున్నారు. స్త్రీలు, పురుషులు సమావేశం అవుతున్నారు. మస్లక్, ఫిఖ్హ, జమాఅత్‌ల విభేదాలు అన్నింటిని పక్కనపెట్టి ఐకమత్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఈ బిల్లు మాకు స్వీకారయోగ్యం కాదు అని గళమెత్తుతున్నారు. పార్లమెంటు మెంబర్‌లందరీ బాధ్యత ఏమిటంటే వారు ఈ బిల్లును రిజెక్ట్ చేయాలి, దీనిని అంగీకరించకూడదు.

సోదర సోదరీమణులారా! ముస్లింలలో ఈ ఆందోళన ఎందుకు ఉందంటే వారు వక్ఫ్ ఆస్తుల అమానతుదారులు (అమీన్‌లు). ఈ ప్రాపర్టీని ప్రభుత్వం ఆక్రమించాలని భావిస్తుంది ఆస్తులను జప్తు చేయాలనుకుంటుంది. వక్ఫ్ ఆస్తులు నిజానికి ముస్లింల ఆస్తులు కావు. ఇవి అత్యంత పవిత్ర (ముఖద్దస్) ఆస్తులు. ఇది అల్లాహ్ ప్రాపర్టీ. ముస్లింలు దీనికి అమానతుదారులు. వాటి సంరక్షకులు. వారి మతపరమైన బాధ్యత ఏమిటంటే ఈ అమానతును ఎట్టి పరిస్థితుల్లోనైనా సంరక్షించాలి. తమ ప్రాణాలను అర్పించి కూడాను ఈ అమానతును సంరక్షించాలి. ఇది వారి ధార్మిక బాధ్యత, ఇది వారి విధి. అందుకే ఈ విధి నిర్వహణకై ముస్లింలు ఈరోజు ఇక్కడ సమావేశమయ్యారు. ఈ విషయమై ప్రభుత్వానికి, దేశ సోదరులకు అవగాహన కల్పించాలి. ఇది ఒక పవిత్ర అమానతు అని మతపరమైన విధి అని దాని సంరక్షణ మన బాధ్యత అని తెలియజేయాలి.

అనేక విషయాలు ఇక్కడ సవివరంగా మీ ముందుకు వచ్చేసాయి. నేను 4 విషయాలు వివరణాత్మకంగా ఇక్కడ మీ ముందు ఉంచదలుచుకున్నాను.

మొదటి విషయం ఈ బిల్లుపై ముస్లింల అభ్యంతరాలు ఏమిటి? నేను దీనికి సంబంధించిన 3 విషయాలు మీ ముందు ఉంచుతాను.

గౌరవనీయ సోదర సోదరీమణులారా! అతి పెద్ద అభ్యంతరం ఏమిటంటే ఈ బిల్లు ముస్లింల మతపరమైన హక్కులలో నేరుగా జోక్యం చేసుకుంటుంది. మన దేశ రాజ్యాంగం ప్రతి పౌరునికి వారు తమ మతాన్ని అవలంబించుకునే హక్కు ఇస్తుంది. తమ మత సంస్థలను తమ ఇష్ట ప్రకారంగా, తమ మత బోధనల ప్రకారంగా నడిపించుకునే హక్కు ఇస్తుంది. మీరు దేశ రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 అధ్యయనం చేయండి. ఇందులో మతాన్ని అవలంబించే హక్కు ఇవ్వబడింది. ఆర్టికల్ 26 అధ్యయనం చేయండి. ఇందులో ప్రత్యేకంగా ప్రతీ మతాన్ని నమ్మే వారిని తమ ఇష్ట ప్రకారంగా సంస్థలు, స్వతంత్రంగా నడిపించుకునే హక్కు ఉంటుంది అనే విషయం స్పష్టం చేయబడింది. ప్రభుత్వానికి అందులో జోక్యం చేసుకునే హక్కు ముమ్మాటికి ఉండదు. ఆర్టికల్ 26 పూర్తిగా ఈ సమస్య కొరకే ప్రత్యేకించబడింది. ఆర్టికల్ 26 అధ్యయనం చేస్తే మీకు ఇది వక్ఫ్ గురించే రచించిన ఆర్టికల్‌గా అనిపిస్తుంది. ఈ వక్ఫ్ అమెండ్మెంట్ బిల్ ఆర్టికల్ 26ను బహిరంగంగా వ్యతిరేకిస్తుంది, ఇంకా చెప్పాలంటే ఆర్టికల్ 26ను అవహేళన చేస్తుంది. ముస్లింల మతపరమైన హక్కులలో నేరుగా జోక్యం చేసుకోవడం జరుగుతుంది. సమస్య అకౌంటెంట్‌ది కాదు, సమస్య డ్రైవర్‌ది కాదు, వక్ఫ్ బోర్డులో చాలా మంది అకౌంటెంట్స్, డ్రైవర్స్ ఇతర ఎంప్లాయిస్ మొదటి నుంచే ఉన్నారు. ఇక్కడ సమస్య వ్యవస్థది. వక్ఫ్ బోర్డులో ఏ మతం వారైనా రావచ్చు అని అంటున్నారు, వక్ఫ్ కౌన్సిల్లో ఎవరైనా రావచ్చు అని అంటున్నారు. ముస్లింలు దీనిపైనే అభ్యంతరం వ్యక్త పరుస్తు న్నారు. ప్రధానమైన విషయం ఏమిటంటే ఈ బిల్లు ముస్లింల మతపరమైన హక్కులలో నేరుగా జోక్యం చేసుకోవడం. ఇది ఒక మతపరమైన సంస్థ, ఇది ఒక మతాన్ని అవలంబించే వారి ద్వారానే దీని మేనేజ్మెంట్ కొనసాగుతుంది. ఈ మత నియమ నిబంధనల ప్రకారంగా దీని మేనేజ్మెంట్ కొనసాగు తుంది. ప్రభుత్వానికి ముస్లింల ఈ మతపరమైన హక్కులలో జోక్యం చేసుకునే అధికారం ఎంత మాత్రం లేదు. ఆర్టికల్ 26 ప్రకారం ప్రభుత్వం ముస్లింల ఈ హక్కులను కచ్చితంగా గౌరవించాలి.

రెండవ అభ్యంతరం ఏమిటంటే, ఇక్కడ మాటిమాటికి ఒక ప్రస్తావన వస్తుంది; మేము వక్ఫ్ ఆస్తుల విషయంలో ఉన్న ఇల్లీగల్ (చట్ట వ్యతిరేక) జప్తులను నియంత్రించాలని భావిస్తున్నామని, వక్ఫ్ ఆస్తులను పరిరక్షించాలనుకుంటు న్నామని, దానిమీద వచ్చే లాభాలతో ముస్లింలకు ప్రయోజనం చేకూర్చాలనుకుంటున్నామని అంటున్నారు. మొదటి స్టేట్మెంట్ ఆఫ్ ఆబ్జెక్ట్‌లో బిల్లు ఉద్దేశాలు ప్రస్తావించ బడ్డాయి. అందులో కూడా ఈ అందమైన మాటలన్నీ ప్రస్తావించబడ్డాయి. కానీ మీరు ఎంపీలను, ఎమ్మెల్యేలను నిలదీయండి (అడగండి) బిల్లులో ఏ మాటలైతే మీరు నోట్ చేశారో వాటితో ఈ ఉద్దేశాలు ఎలా నెరవేరుతాయి? మీరు వక్ఫ్ ప్రాపర్టీలు సురక్షితంగా ఉండా లని భావిస్తే లిమిటేషన్ యాక్ట్ తీసివేసి మీరు వక్ఫ్ ఆస్తులను ఎలా సంరక్షిస్తారు? మీరు వక్ఫ్ ను కాపాడాలను కుంటు న్నారు. Wakf by use తొలగించి మీరు దానిని ఎలా కాపాడాలనుకుంటున్నారో వివరించండి. ఎవరైతే వక్ఫ్ ఆస్తులను దౌర్జన్యంగా ఆక్రమించుకుంటున్నారో వారిని మీరు శిక్షించాలనుకుంటున్నారు సరే, కానీ మీ బిల్లు ఏమంటుంది? ఏ శిక్షలైతే ముందుగా యాక్ట్‌లో ప్రస్తావించబడ్డాయో ఆ శిక్షలు తగ్గించబడతాయి. ముందు వక్ఫ్‌ను దౌర్జన్యంగా కబ్జా చేసుకోవడం అనేది నాన్ బెయిలబుల్ ఆఫెన్స్‌గా ఉండేది. ఇప్పుడు ఈ బిల్లులో దానిని తొలగించారు. బెయిలబుల్‌గా మార్చి వేస్తారు. శిక్షలు తగ్గించబడ్డాయి, జరిమానాలు తగ్గించబడ్డాయి. ఇటువంటి విధానాలతో మీరు వక్ఫ్ ను ఎలా సంరక్షించాలనుకుంటున్నారు?




ఈ పూర్తి బిల్లులో ఒక్క ఆర్టికల్ కూడా మంచి సంకల్పాన్ని సూచించే విధంగా లేదు. ప్రతి ఆర్టికల్ దుస్సంకల్ప ఆధారితంగానే ఉంది. ప్రతి ఆర్టికల్ వక్ఫ్ ఆస్తులపై ఇల్లీగల్ ఆక్రమణల దాడులకు అనుకూలంగా ఉంది. వక్ఫ్ వ్యవస్థను తీవ్రస్థాయిలో వినాశనం వైపునకు తీసుకు వెళుతున్నారు. ఈ బిల్లు కేవలం ముస్లింల ప్రయోజనాలకు వ్యతిరేకంగా మాత్రమే కాదు, పూర్తి దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉంది. ఇక్కడి ప్రతి పౌరుని ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉంది. ఈ దేశ రాజ్యాంగానికి విరుద్ధంగా ఉంది. ఈ దేశ ఉజ్వల భవిష్యత్తుకు వ్యతిరేకంగా ఉంది. ఈ బిల్లు మన ఫెడరల్ స్పిరిట్‌కు వ్యతిరేకంగా ఉంది. ఏ హక్కులైతే రాష్ట్రాలకు రాజ్యాంగం ఇచ్చిందో ఆ హక్కులు కాపాడబడాలి. వాటిపై అనవసరమైన ఆంక్షలు విధించరాదు. ఈ బిల్లును అధ్యయనం చేయండి, ఈ బిల్లు హక్కులను అడుగడుగునా నియంత్రించేందుకై ప్రయత్నించింది. ఒకసారి భారత రాజ్యాంగంలో 7వ షెడ్యూల్ను అధ్యయనం చేయండి. రాష్ట్ర అధికారాలు అందులో తెలుపబడ్డాయి. స్టేట్ సబ్జెక్ట్స్ ఏమిటి? ప్రాంతీయ సబ్జక్ట్స్ ఏమిటి? జాయింట్ సబ్జెక్ట్స్ ఏమిటి? పూర్తి అధికారాల లిస్ట్ పొందుపరచబడింది. అందులో ఐటెం నెంబర్ 45ను ఒకసారి పరిశీలించండి. ల్యాండ్ రికార్డ్స్, రెవెన్యూ రికార్డ్స్, ల్యాండ్ రిజిస్ట్రేషన్ ఇదంతా పూర్తిగా స్టేట్స్ సబ్జెక్టు మాత్రమే. ఇప్పుడు ఈ బిల్లు ప్రకారంగా కేంద్ర ప్రభుత్వం వక్ఫ్‌ను రిజిస్టర్ చేస్తుంది. ఎందుకు చేస్తుంది? మీరు రాష్ట్ర అధికారాలలో ఎందుకు జోక్యం చేయదలుచుకున్నారు? రాజ్యాంగం లేదా? రాజ్యాంగంలో మీ హద్దులు చూపించ బడలేదా? ఇది రాష్ట్ర ప్రభుత్వం పని. కేంద్ర ప్రభుత్వం ఎందుకు జోక్యం చేయదలుచుకుంటుంది? స్టేట్ అసెంబ్లీలు ఈ బిల్లుకు వ్యతిరేకంగా తీర్మానాలు చేయాలి. ఇది రాష్ట్ర హక్కులకు వ్యతిరేకంగా ఉంది. ఇది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వానికి, కేరళ రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉంది. ప్రతి రాష్ట్రానికి రాజ్యాంగం ఏ హక్కులనైతే ఇచ్చిందో కేంద్ర ప్రభుత్వం ఆ హక్కులను కాలరాయాలని చూస్తుంది. ఈ బిల్లు ప్రజాస్వామ్య వ్యతిరేక బిల్లు మన దేశ మన రాజ్యాంగ ప్రజాస్వామిక స్పిరిట్‌ను పూర్తిగా ఉల్లంఘించడమే. గౌరవప్రదమైన మిత్రులారా, పెద్దలారా! ఈ పూర్తి వివరాలు మీ ముందుకు వచ్చేసాయి. అయితే ఈ బిల్లు అన్ని కోణాల నుండి ఈ దేశానికి, ఇక్కడి ప్రజలకు, ప్రతి ఒక్కరికి నష్టదాయకం. ఈ వక్ఫ్ అమెండ్మెంట్ యాక్ట్ ద్వారా ముస్లింలకు కొన్ని ప్రత్యేక రాయితీలు ఇవ్వబడ్డాయి అనే ప్రచారాలు చేస్తున్నారు. కొంతమంది ఇక్కడ తెలుగు ప్రసంగాలలో ఇది కూడా ప్రస్తావించారు: వక్ఫ్ యాక్ట్ 2013, 1995 ఇందులో ఏ విషయం కూడా కేవలం ముస్లింలకై ప్రత్యేకించబడినది లేదు. ఏ విధంగానైతే వక్ఫ్ యాక్ట్ ఉందో అదే విధంగా అన్ని రాష్ట్రాలలో ఎన్నో చట్టాలు ఉన్నాయి. మీ దగ్గర ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్ చారిటబుల్ అండ్ హిందూ రిలీజియన్ ఇన్స్టిట్యూషన్స్ అండ్ ఎండోమెంట్ యాక్ట్ 1987 ఉంది. మీరు దానిని పరిశీలించండి. అలాగే తమిళనాడు అక్ట్ ఉంది, కర్ణాటక అక్ట్ ఉంది, సిక్కుల అక్ట్ ఉంది, ఇవన్నీ ఒకసారి పరిశీలించండి. ఏ విషయాలనైతే ముస్లింలందరూ కోరుకుంటున్నారో, ఏవైతే వక్ఫ్ యాక్టులో ఉన్నాయో, సరిగ్గా అలాంటి నిబంధనలే అన్ని మతాల వారికి ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ చారిటబుల్ అండ్ హిందూ రిలీజియన్ ఇన్స్టిట్యూషన్స్ అండ్ ఎండోమెంట్ యాక్ట్ 1987 ఇందులో ఏమని ఉందంటే హిందూ సంస్థలను నడిపే బోర్డు మెంబర్స్ ట్రస్ట్ మెంబర్స్ వీరందరూ హిందువులే అయి ఉండాలి. చాలా రాష్ట్రాలలో కమిషనర్స్ ఉంటారు. యాక్ట్‌లో కమిషనర్ హిందూ ఉండాలని రాయబడి ఉంది. సిక్కుల యాక్టులో సిక్కు అయి ఉండాలని ఉంది. వక్ఫ్ బై యూజ్, మీరు ఈ మొత్తం యాక్ట్‌లో మందిరం డెఫినేషన్ (నిర్వచనాన్ని) చదువుకోండి. అందులో ఏమని ఉందంటే దేవాలయాలు ఏ మతపరమైన సంస్థ అంటే దేవాలయం లాగానే అది రిజిస్టర్ అయి ఉన్నా లేదా దేవాలయంలా ఎన్నో ఏళ్ల నుండి అది ఉపయో గించ బడుతున్నా అటువంటి తరుణంలో ఒకవేళ రిజిస్టర్ కాకపోయినా కూడాను దేవాలయం లాగానే పరిగణించబడుతుంది. అన్ని మతాల ప్రాంతీయ చట్టాలలో ఈ విషయమే పొందుపరచబడి ఉంది. వక్ఫ్ బై యూజ్‌ను ముస్లింలు కోరుకుంటున్నారు అంటే ఇదేమీ కొత్త అభ్యర్థన (డిమాండ్) కాదు. ఏ హక్కు అయితే అన్ని మతాల వారికి ఇవ్వబడిందో, అదే హక్కు ముస్లింలకు కూడా ఇవ్వాలి. కేవలం ఆ హక్కు సంరక్షణను వారు కోరుకుంటున్నారు. ఇది మన రాజ్యాంగ స్పిరిట్ ప్రకారంగా ఉంది. ఎందుకంటే మన రాజ్యాంగం అన్ని మతాలను అవలంబించే వారికి వారి మత వ్యవహారాలు నడిపే హక్కు వారికి కల్పించింది.

**(మిగతా వచ్చేవారం)**

# అసాధారణ, అద్భుత జ్ఞాపక శక్తికి మారుపేరు మదర్సా విద్యార్థులు



**- ముజమ్మిల్**

**మదర్సా**లో హాఫిజ్ విద్యార్థులకు మంచి నైపుణ్యాలు నేర్పితే అద్భుతాలు సృష్టిస్తారు. ఇందుకు ఎన్నో ఉదాహరణలున్నాయి. ఖుర్‌ఆన్ గ్రంథాన్ని ఆసాంతం కంఠస్థం చేయడం అంటే అదొక అద్భుతమైన జ్ఞాపక శక్తికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు. 114 చాప్లర్లు, ఆరువేలకు పైచిలుకు వాక్యాలున్న గ్రంథాన్ని రెండు, మూడేళ్లలో కంఠస్థం చేస్తారు పిల్లలు. కంఠస్థం చేయగల ధార్మిక గ్రంథం ఈ ప్రపంచంలో ఏదైనా ఉందంటే అది ఖుర్‌ఆన్ గ్రంథానికే ఆ ప్రత్యేకత ఉంది. రమజాన్ నెల రోజులపాటు ఈ హాఫిజె ఖుర్‌ఆన్‌లు తరావీ నమాజులో ఖుర్‌ఆన్ చదివి వినిపిస్తారు. కొందరైతే పదిరోజుల్లో ఇంకొందరు యువ హాఫిజ్‌లు మూడు రోజుల్లోనూ ఖుర్‌ఆన్ పూర్తి చేస్తారు. ఖుర్‌ఆన్ కంఠస్తంతో ఇంతటి జ్ఞాపకశక్తి ఉన్న పిల్లల్ని టెక్నికల్ ఎడ్యుకేషన్, సివిల్స్, వైద్య విద్య చదివిస్తే అద్భుతాలు సృష్టిస్తారనడానికి ఎన్నో నిదర్శనాలున్నాయి. హాఫిజ్ సహెల్ ఓ కార్పొరేట్ కంపెనీలో హెచ్.ఆర్ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. నాకు తెలిసిన సిటీలో ఎంతో పేరున్న ఓ చిల్డ్రన్ సర్జన్ చిన్నప్పుడు మదర్సాలో ఖుర్‌ఆన్ హిఫ్జ్ చేశాడని తరువాత తెలిసింది నాకు. మౌలానా హమ్మాద్ జఫర్ 2013లో సివిల్స్ ర్యాంకు సాధించాడని అప్పట్లో నేషనల్ మీడియాలో కథనాలు వచ్చాయి. షాహిద్ అన్సారీ అనే మదర్సా స్టూడెంట్ సివిల్స్ సక్సెస్ తనకు ప్రేరణ అని జఫర్ చెప్పుకొచ్చాడు. 2019లో మౌలానా షాహిద్ రజా ఖాన్ యూపీఎస్సీ సివిల్స్‌లో 751 ర్యాంకు సాధించాడు. 'నాలో విశ్వాసాన్ని పెంచి, నా చిత్తశుద్ధిని పెంపొందించి, నన్ను నిబద్ధత కలిగిన వ్యక్తిగా మార్చిన మదర్సా విద్యకే నా విజయాల క్రెడిట్‌ని అందజేస్తాను' అని షాహిద్ మీడియాతో అన్నారు. మొట్టమొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ కూడా ఒక మదర్సా స్టూడెంట్ అన్న విషయం చాలా మందికి తెలియదు. ఆయన అనువదించిన ఉర్దూ ఖుర్‌ఆన్ గ్రంథం ఎంతో ఆదరణపొందింది. విద్యారంగంలో ఆయన చేపట్టిన సంస్కరణల గురించి ఎంత రాసినా తక్కువే. ముహమ్మద్ ప్రవక్త (స) విద్యాజ్ఞానాలకు ఎంతో ప్రాముఖ్యత నిచ్చారు. యుద్ధంలో పట్టుబడ్డ ఖైదీలచేత తమ శిష్యులకు చదువు చెప్పే షరతుతో విడుదల చేసేవారంటే విద్యాజ్ఞానాలకు ఎంత ప్రాధాన్యత ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ మధ్యన చాలా మంది మిడిమిడి జ్ఞానం ఉన్నవారు ఇస్లామ్ విశ్వాసాలపై, మదర్సా విద్యపై పిచ్చిరాతలు రాస్తు న్నారు. నేను వాళ్లకు చెప్పేదొక్కటే. ఖుర్‌ఆన్ అనువాదాన్ని చదవండి. ముహమ్మద్ ప్రవక్త జీవిత చరిత్రను, ఆయన బోధనలను చదవండి. ఇస్లామ్ ధర్మ బోధనలు ప్రళయ కాలం వరకూ అనుసరణీయం, ఆచరణీయం. తహారత్, గుసుల్, ఖత్నా ఇవన్నీ పరిశుభ్రత కోసం ప్రవక్త నేర్పిన నియమాలు. మహర్, స్త్రీలకు ఆస్తిహక్కు ఇవన్నీ స్త్రీలకు ఆర్థిక స్వావలబంన కలిగిస్తాయి. ఇకపోతే ఖుర్‌ఆన్‌లో మానవ పుట్టుక, విశ్వం గురించి ఎన్నో అద్భుతమైన సైన్సు విషయాలు న్నాయి. ఎంతోమంది శాస్త్రవేత్తలు ఖుర్‌ఆన్ చదివి ఇస్లామ్ స్వీకరించారు. ఇలాంటి ఎన్నో విషయాలు చదివి ఇస్లామ్ పరిజ్ఞానాన్ని పెంచుకుని రాయండి. ❖

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది ఖుర్‌ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

59 ఆయత్‌లు

# 44. అద్ దుఖాన్

మక్కా అవతరణ

16 మేము ఇదో కాస్త యాతనను తొలగిస్తాము, అంతే, మీరు ముందు చేస్తూ ఉన్నదాన్నే తిరిగి చేస్తారు. ఏ రోజునయితే మేము పెద్ద దెబ్బ తీస్తామో ఆ రోజు, మేము మీ పట్ల ప్రతీకారం తీర్చుకునే రోజు.[13]

**(13వ పాదసూచిక గత సంచిక తరువాయి)**

ఈ వ్యాఖ్యానం విని గాభరాపడి లేచి కూర్చున్నారు, ఇలా అన్నారు, "మనిషికి తెలియకపోతే తెలిసినవారిని అడిగి తెలుసుకోవాలి."

అసలు విషయం ఏమిటంటే, కురైష్ ప్రజలు ఇస్లామ్ స్వీకరించడానికి నిరాకరిస్తూ ప్రవక్త మహనీయుల్ని వ్యతిరేకిస్తూనే ఉండగా ప్రవక్త(శ్రీ (స) వేడుకున్నారు, దేవా, హజ్రత్ యూసుఫ్ (అలైహిస్సలామ్) కాలంలో వచ్చినటువంటి కరవులాంటి కరవుతో నాకు తోడ్పడు అని. తదనుగుణంగా తీవ్రమయిన క్షామం దాపురించింది. జనులు ఎముకలు, తోళ్ళు, ముర్దార్ (మృత జంతువులు) సయితం తిన్నారు. ఆ కాలంలో పరిస్థితి ఏమిటంటే, మనిషి ఆకాశం వైపునకు తలెత్తి చూస్తే అతనికి ఆకలి తీవ్రతవల్ల అంతా పొగ పొగగానే కనిపించేది. కడకు అబూ సుఫ్యాన్ వచ్చి ప్రవక్త(శ్రీ (స)తో అన్నాడు, మీరయితే బంధువుల ఎడల దయ చూపాలని ఉద్బోధిస్తారు. మీ జాతివారు ఆకలితో అలమటిస్తున్నారు. ఈ కరవు కాటకాలు తొలిగి పోవాలని అల్లాహ్‌ను ప్రార్థించండి. ఈ కాలంలోనే కురైష్ ప్రజలు, దైవమా, మా నుండి ఈ కరవు దూరం చేసివేసినట్లయితే మేము విశ్వాసం గైకొంటాము అని అనేవారు. ఈ సంఘటననే ఈ ఆయత్‌లలో ప్రస్తావించడం జరిగింది. 'పెద్ద దెబ్బ' అంటే చివరికి బద్ర్ యుద్ధంలో కురైష్ పైన దెబ్బ తీసిన వైనం అన్న మాట. ఈ ఉల్లేఖనాన్ని ఇమామ్ అహ్మద్, బుఖారి, తిర్మిజి, నసాయి, ఇబ్నుజరీర్, ఇబ్ను అబీ హాతిమ్ అనేక ప్రమాణాలతో 'మస్రూక్' ద్వారా ఉటంకించారు. మస్రూక్‌తో పాటు, ఇబ్రాహీమ్ నఖయీ, కతాద, ఆసిమ్, ఆమిర్ కూడా, హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్‌ఊద్ ఈ ఆయత్‌కు ఈ వ్యాఖ్యానమే చేశారని చెప్పారు. అందువల్ల ఆయనగారి అభిప్రాయం వాస్తవంగా ఇదే అన్న విషయంలో ఎటువంటి అనుమానం మిగులదు. అనుచరుల్లో ముజాహిద్, కతాద, అబుల్ ఆలియా, ముకాతిల్, ఇబ్రాహీమ్ నఖయీ, జహ్హాక్, అతియ్యా అల్ ఔఫీ ప్రభృతులు సయితం ఈ వ్యాఖ్యానంలో హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్‌ఊద్‌తో ఏకీభవించారు.

మరోవైపున, హజ్రత్ అలీ, ఇబ్ను ఉమర్, ఇబ్ను అబ్బాస్, అబూ సయీద్ ఖుద్రీ, జైద్ బిన్ అలీ, హసన్ బస్రీ వంటి ప్రముఖులు చెప్పేదాని ప్రకారం ఈ ఆయత్‌లలో ప్రళయానికి సమీప కాలాన్ని ప్రస్తావించడం జరిగింది. ఇందులో ప్రస్తావించిన పొగ ఆ కాలంలోనే నేలపైన అలుముకుంటుంది. ఈ వ్యాఖ్యానానికి మరింత బలం చేకూర్చే ఉల్లేఖనాలు స్వయాన ప్రవక్త మహనీయులు (స) ద్వారా ఉటంకించబడినవి ఉన్నాయి. హుజైఫా బిన్ ఉసైద్ అల్ గిఫారీ ఇలా చెప్పారు, ఒక రోజున మేము ప్రళయం గురించి పరస్పరం చర్చించుకుంటున్నాము. అంతలోనే ప్రవక్త మహనీయులు (స) అటు వచ్చారు. ఇలా సెలవిచ్చారు, పది సంకేతాలు ఒకదాని తరువాత మరొకటి వ్యక్తం కానంత వరకు ప్రళయం ఏర్పడదు. అవి: సూర్యుడు పశ్చిమాన ఉదయించడం, పొగ, జంతువు, యాజూజ్ మాజూజ్ బయటపడటం, మర్యమ్ సుతుడు ఈసా అవతరణ, నేల క్రుంగిపోవడం – తూర్పున, పడమరన, అరేబియా ద్వీప కల్పంలో, అదన్ (Eden) నుండి అగ్ని మొదలయి జనుల్ని తోలుకుపోవడం (ముస్లిమ్). దీన్ని అబూ మాలిక్ అష్‌అరీ ఉల్లేఖనం బలపరుస్తోంది, ఆ ఉల్లేఖనాన్ని ఇబ్ను జరీర్, తబరానీ ఉటంకించారు. ఇబ్ను అబీ హాతిమ్ ఉటంకించిన అబూ సయీద్ ఖుద్రీ ఉల్లేఖనమూ దీనిని బలపరుస్తోంది. ఈ రెండు ఉల్లేఖనాలను బట్టి, ప్రవక్త మహనీయులు (స) 'పొగ'ను ప్రళయానికి సంకేతంగా పరిగణించారు. వీటిలో ప్రవక్త(శ్రీ (స) ఆ పొగ ముసురుకున్నప్పుడు విశ్వాసిపైన దాని ప్రభావం కేవలం జలుబు లాంటిదవుతుందని, తిరస్కారి నర నరంలో అది నిండిపోతుందని, అతనిలోని ప్రతి బయట పడే బెజ్జం నుండి అది బయట పడుతుందని తెలుస్తోంది.

ఈ రెండు వ్యాఖ్యానాల మధ్యనున్న భేదం, పై ఆయత్‌లను పరిశీలనగా అధ్యయనం చేస్తే దూరమయిపోగలదు. హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్‌ఊద్ వ్యాఖ్యానం విషయానికి వస్తే మక్కాలో ప్రవక్త(శ్రీ (స), ప్రార్థన మూలంగా అతి తీవ్రమయిన కరవు ఏర్పడింది. దానివల్ల తిరస్కారుల బలం చాలామటుకు సన్నగిల్లింది.

13వ పాదసూచిక మిగతా వచ్చే సంచికలో)

# సహీహ్ బుఖారీ (6వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)
తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ الْمَغَازِيْ

## 4. యుద్ధాల ప్రకరణం -2

(కితాబుల్ మగాజీ)

## ఖైబర్ యుద్ధం

**84)** సువైద్ బిన్ నోమాన్(రజి) తెలియజేశారు: ఖైబర్ యుద్ధం కొరకు దైవప్రవక్త(సఅసమ్)తోపాటు వెళ్ళిన వారిలో ఆయన కూడా ఉన్నారు (ఆయన ఇలా అన్నారు:) ఖైబర్ పల్లపు ప్రాంతంలో ఉన్న 'సహ్‌బా'కు చేరుకున్న మీదట దైవప్రవక్త(స) అస్ర్ నమాజ్ చేశారు. తరువాత ఆయన(స) భోజనం సమకూర్చమని కోరారు. సత్తు పిండి తప్ప మరొక ఆహార పదార్థమేదీ ఆయన సమక్షంలో హాజరు పరచబడలేదు. ఆయన(స) ఆదేశానుసారం అదే నానబెట్టబడింది. దానినే ఆయనా తిన్నారు, మేమూ తిన్నాము. ఆ తరువాత మగ్రిబ్ నమాజ్ కొరకు ఆయన(స) లేచి నిలబడ్డారు (ముందు నుంచే వుజూ చేసిన స్థితిలో ఉన్నందున) కేవలం పుక్కిలించారు. మేమూ పుక్కిలించాము. పిదప నమాజ్ చేశారు. ఈ నమాజ్ కొరకు మళ్ళీ వుజూ చేయలేదు.

**85)** సలమా బిన్ అక్వా (రజి) కథనం: మేము ప్రవక్త మహనీయుల (సఅసమ్)తోపాటు ఖైబర్‌కు బయలు దేరాము. రాత్రి పూట మా పయన బృందం సాగిపోతుండగా ఒక సహాబీ (ఉసైద్ బిన్ హుజైర్) ఆమిర్‌తో, 'ఆమిర్! కొన్ని కవితలు వినిపించు' అని కోరారు. ఆమిర్ ఒక కవి. మిత్రుని కోరికపై ఆయన తన వాహనం నుండి దిగి కవితలు వినిపించసాగారు–

'ఓ అల్లాహ్! నీవే గనక లేకుంటే మాకు సన్మార్గం లభించేది కాదు.

మేము దానధర్మాలు చేయటంగానీ, నమాజ్ చేయటం గానీ సంభవమయ్యేది కాదు.

కనుక మమ్మల్ని శీఘ్రంగా మన్నించు.
మేము బ్రతికున్నంత వరకూ మా ప్రాణాలు నీ మార్గంలో సమర్పితం.
ఒకవేళ మేము (శత్రువును) మార్కొనవలసి వస్తే

మా పాదాలకు స్థిరత్వాన్ని ప్రసాదించు. మా పైన ప్రశాంతతను అవతరింపజెయ్యి.

మమ్మల్ని వారు (అసత్యం వైపునకు) పిలిచినప్పుడు, మేము నిరాకరిస్తున్నాము.

ఈ రోజు వారు అరుస్తూ మాకు వ్యతిరేకంగా కదన రంగానికి కదలి వచ్చారు'.

"ఇంతకీ ఈ కవితలు చెబుతున్నది ఎవరు?" అని దైవప్రవక్త(సఅసమ్) విచారించగా, 'ఆమిర్ బిన్ అక్వా' అని జనులు చెప్పారు. దానికి దైవప్రవక్త(స), "అల్లాహ్ అతనిపై తన కారుణ్యాన్ని కురిపించుగాక!"

అని పలికారు. ఈ మాట విన్న ప్రియ సహచరులు (రజి) 'దైవప్రవక్తా! మీరతన్ని అప్పుడే అమరగతి నొందేవానిగా ఖరారు చేసేశారు. అతని (కవితల) ద్వారా మరింత లబ్ది పొందే అవకాశం మాకు కల్పించాల్సింది' అని విన్నవించుకున్నారు.

తరువాత మేము ఖైబర్ చేరుకుని కోటను ముట్టడించాము. ఆ సందర్భంగా మేము ఎన్నో బాధల్ని భరించాల్సి వచ్చింది. పస్తులుండాల్సి వచ్చింది. ఎట్టకేలకు అల్లాహ్ మాకు విజయం ప్రసాదించాడు. కోట కైవసం కానున్న రోజు రాత్రి సైనిక గుడారాల వద్ద పలుచోట్ల మంటలు కనిపించాయి. అది గమనించిన దైవప్రవక్త(స), "ఎన్నో చోట్ల మంటలు కనిపిస్తున్నాయి. ఏమిటి విశేషం?" అని అడిగితే, 'మాంసం వండటానికి నిప్పు రాజేశార'ని సహచరమాన్యులు సమాధానమిచ్చారు. "ఇంతకీ ఏ పశువుల మాంసం?" అని మహాప్రవక్త(స) ప్రశ్నించగా, 'పెంపుడు గాడిదల మాంసం' అని సహచరులు జవాబిచ్చారు. "వద్దు. ఆ మాంసం అంతా పార వేయండి. ఆ కుండల్ని పగులగొట్టండి" అని మహాప్రవక్త(స) ఆదేశించారు. దానికి ఒక సహచరుడు, 'దైవప్రవక్తా! మాంసాన్ని పారవేసి, కుండల్ని కడిగితే సరిపోదా!?' అని సందేహపడగా, "సరే, అలాగే కానివ్వండి" అని ఆయన(స) చెప్పారు. (తెల్లవారాక సహచరమాన్యులు యుద్ధం కొరకు) వరుసలు తీరి నిలబడినప్పుడు, ఆమిర్(రజి) కరవాలం మరీ చిన్నదిగా కనిపించింది. అందుచేత ఆయన ఒక యూదునిపై అదుపు సాధించినప్పుడు, వంగి అతని పిక్కలపై వ్రేటు వేయబోయారు. కాని ఆ ప్రయత్నంలో స్వయంగా ఆయన మోకాలిలోనే అది దిగబడింది. ఆ గాయంతోనే ఆయన అసువులు బాసారు.

సైన్యం తిరిగి వస్తుండగా, దైవప్రవక్త(స) సలమా బిన్ అక్వా(రజి) చెయ్యి పట్టుకుని, "ఏమిటి విశేషం?' అని ప్రశ్నించారు. దానికి నేను, 'దైవప్రవక్తా! నా తల్లిదండ్రులు మీకు సమర్పితం. ఆమిర్(రజి) చేసుకున్నదంతా వ్యర్థమైపోయిందని కొంతమంది చెప్పుకుంటున్నారు (కారణం ఆయన చేతిలో ఉన్న ఖడ్గం స్వయంగా ఆయన శరీరాన్నే గాయపరిచింది)' అన్నాను. దానికి సమాధానంగా ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఇలా అన్నారు: "ఆ విధంగా చెప్పేవాడు అబద్ధీకుడు. వాస్తవానికి అతనికి (ఆమిర్‌కు) రెండింతల పుణ్యఫలం ప్రాప్తమవుతుంది". తరువాత ఆయన (స) తన చేతివ్రేళ్ళు రెండింటినీ కలిపి, "అతను బాధను భరించడంతోపాటు దైవమార్గంలో జిహాద్ కూడా చేశాడు. ఈ రకమయిన ఉదాహరణను నెలకొల్పిన అరబ్బు బహుశా అరుదే"[1] అన్నారు. వేరొక ఉల్లేఖనం ప్రకారం, "మదీనాలో ఆమిర్ వంటి అరబ్బు బహుశా పుట్టలేదేమో!" అన్నారు.

85-1. హదీసులో ఖైబర్ యుద్ధ ఘట్టాలు కొన్ని విశ్లేషించబడ్డాయి. ఈ కారణంగానే దీనిని ఈ అధ్యాయం క్రింద తీసుకోవటం జరిగింది. హదీసులో ప్రస్తావనకు వచ్చిన ఆమిర్(రజి) ఖైబర్ సర్దారును ఎదుర్కొనే ఉద్దేశ్యంతో ముందుకు వెళ్ళారు. కాని ఆయన కరవాలం స్వయంగా ఆయన చేత్తోనే ఆయన మోకాలిలో దిగబడింది. ఆ గాయంతోనే ఆయన అమరగతినొందారు. ఆమిర్‌ది ఆత్మహత్య అన్న సందేహం కొంతమందికి కలిగింది. ఈ సందేహాన్ని నివృత్తి చేయడానికే దైవప్రవక్త(స) ఆమిర్ గొప్పతనాన్ని కొనియాడారు.

★★★




**కుటుంబం...** అతి ప్రాచీన సంస్థగా చెప్పుకోవచ్చు. గతమైనా, వర్తమానమైనా, భవిష్యత్తులోనైనా ఈ సంస్థ కార్యకలాపాలు అతి కీలకమైనవి. కుటుంబమనే కట్టడాన్ని పటిష్టంగా నిర్మిస్తే పది కాలాలపాటు మనగలుగుతుంది. దానికి విరుద్ధంగా కుటుంబ మనే కట్టడం పునాదులు బలహీనంగా ఉంటే ఆ కట్టడం కూలిపోవడం ఖాయం. ప్రస్తుతం అతి ప్రాచీన సంస్థగా చెప్పుకునే కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నమవుతుంది. మూఢనమ్మకాలు, పాశ్చాత్య పోకడలు, భౌతికవాదం ఇవన్నీ కుటుంబ వ్యవస్థను కుళ్లబొడుస్తున్నాయి. ప్రేమ, వాత్సల్యం, ఆత్మీయ, అనురాగాలు మాయమైపోతున్నాయి. అనైతికత, స్వార్థం, హక్కుల ఉల్లంఘన మన ఇంటి వాతావరణాన్ని కలుషితం చేస్తున్నాయి. రక్త సంబంధీకులే పరస్పరం అపరిచితుల్లా మారిపోతున్నారు. మలిసంధ్యలో అమ్మానాన్నలు అనాథాశ్రయాల్లో వదిలేస్తున్నారు. భార్యాభర్తల మధ్య నమ్మకం కోల్పోతున్నారు. అక్రమ సంబంధాల వార్తలు, హత్యలు ఆందోళన కలిగిస్తున్నాయి. స్మార్ట్ ఫోన్ విప్లవం పసి మెదళ్లను నేరగ్రస్తులుగా మారుస్తోంది. వెరసి మన కుటుంబ వ్యవస్థ ఛిన్నాభిన్నమవుతోంది. కూలిపోతున్న మన కుటుంబ వ్యవస్థను కాపాడుకోవడం మనందరి కర్తవ్యం. ఆదర్శ కుటుంబ నిర్మాణం కోసం ఖుర్‌ఆన్ కొన్ని సూచనలు చేసింది. ఖుర్‌ఆన్ ప్రబోధించిన కుటుంబ విలువలను ఆచరణలో పెడితే ఆదర్శ కుటుంబాలను స్థాపించి సుందర సమాజాన్ని నిర్మించవచ్చు.

## ఖుర్‌ఆన్ బోధించే కుటుంబ విలువలు

మనిషి సంఘజీవి. ఈ విశ్వవ్యవస్థ ఉనికిలోకి వచ్చినప్పటి నుండి మనిషి జంటగా వచ్చాడు. ఈ ప్రపంచంలోని మిలియన్ల సంఖ్యలో ఉన్న జనాభా మొత్తం ఆదమ్-హవ్వాల సంతానమే. మనిషి పుట్టుక తోటే తన తల్లి అనే బాంధవ్యాన్ని ఏర్పరుచుకుంటాడు. ఆ తరువాత తండ్రి, అన్న, తమ్ములు, అక్కాచెల్లెళ్లనే బంధాన్ని ఏర్పరుచుకుంటాడు. కుటుంబ జీవితాన్ని గడపడమనేది మానవ జన్మ ఔన్నత్యంగా చెప్పుకోవచ్చు.

## భార్యాభర్తల బంధం

భార్యాభర్తల బంధంతో ఒక కొత్త కుటుంబానికి అంకురార్పణ జరుగుతుంది. ఆలూమగల మధ్య బంధం ప్రేమ, ఆప్యాయత లకు ప్రతిరూపంగా ఉండాలి. ఒకరికొకరు తెలుసుకుని

మసలుకోవాలి. భార్యా-భర్తలను దుస్తులతో సరిపోల్చింది ఖుర్‌ఆన్. మరోచోట భార్యాభర్తల బంధం అల్లాహ్ చిహ్నాలలో ఒకటి అని పేర్కొంటోంది.

**ఆయన సూచనలలో మరొకటి ఏమిటంటే ఆయన మీ కొరకు భార్యలను మీ జాతిలో నుండే సృష్టించాడు- మీరు వారివద్ద శాంతిని పొందటానికి, మీ మధ్య ప్రేమనూ, కారుణ్యాన్నీ సృజించాడు. (దివ్యఖుర్‌ఆన్ 30:38)**

**వారు మీకు దుస్తులు, మీరు వారికి దుస్తులు. (2:187)**

## ఇల్లాలి పట్ల ఉత్తమంగా వ్యవహరించాలి

**వారితో సద్భావంతో జీవితం గడపండి. ఒకవేళ మీకు వారు నచ్చకపోతే, బహుశా మీకు ఒక వస్తువు నచ్చకపోవచ్చు. కాని అందులోనే అల్లాహ్ ఎంతో మేలును పెట్టివుండవచ్చు. (4:19)**

'ఒక ముస్లిమ్ తన భార్యను అసహ్యించుకోరాదు. ఆమెను కసురుకోరాదు' అని హితవు పలికారు ప్రవక్త ముహమ్మద్. భర్తకు విధేయురాలయి జీవితాన్ని గడిపే మహిళ అల్లాహ్ ప్రసన్నుడవుతాడని, భర్త తనవంక చూసినప్పుడు చిరునవ్వుతో పలకరించే గృహిణి పట్ల అల్లాహ్ సంతుష్టుడవుతాడని ప్రవక్త శుభవార్త నందించారు.

## ఇంటివారి పట్ల సఖ్యతగా మెలగాలి

అమ్మానాన్న, భార్యాభర్త, అన్నా, చెల్లి, తమ్ముడు అక్కా ఈ బంధాల ప్రతిరూపమే ఇల్లు. కుటుంబ వ్యవస్థ అల్లాహ్ వరంగా పేర్కొంటోంది ఖుర్‌ఆన్. రక్తసంబంధీకులు, దగ్గరి బంధువుల హక్కులు, బాధ్యతలు నెరవేరబడినప్పుడే ఆదర్శ కుటుంబం నిర్మితమవుతుంది. ఇంట్లో మొట్టమొదటిగా ఆదరణకు పూర్తి అర్హులు ఎవరైనా ఉన్నారంటే కనిపెంచిన అమ్మానాన్నలే. ఇంట్లో ముసలి తల్లిదండ్రులను కంటికి రెప్పలా కాపాడుకోవాలి. వారి ముందు విసుగ్గా 'ఉఫ్' అని కూడా అనరాదన్నది ఖుర్‌ఆన్ హెచ్చరిక. 'తల్లి పాదాల చెంత స్వర్గముంది, తండ్రి స్వర్గానికి ప్రధాన ద్వారం' అని ప్రవక్త నొక్కి చెప్పారు. మరణానంతర జీవితాన్ని విశ్వసించేవారు తమ తల్లిదండ్రులను ఎంతో కరుణతో చూసుకుంటారు. అమ్మానాన్నల ఆదరణ లభించే ఇల్లు స్వర్గసీమగా మారుతుందనడంలో మరోమాటకు తావులేదు.

## ఇంట్లో ఆడపిల్లల పట్ల వివక్ష చూపరాదు

ఆడపిల్లలు ఇంటికి వెలుగులు. ఎవరికైనా ఆడపిల్లలున్నారంటే వారు తమ పిల్లలను ఎలాంటి వివక్ష చూపకుండా పెంచాలి. ముగ్గురు లేదా ఇద్దరు లేదా ఒక ఆడపిల్లనైనా పెంచి పెద్దచేసి తగిన విద్యాబుద్ధులు నేర్పి తగిన వరుడికిచ్చి వివాహం చేస్తే అలాంటి తల్లిదండ్రులకు ఆ అమ్మాయిలు నరకానికి అడ్డుగోడలవుతారని ప్రవక్త(స) శుభవార్తనిచ్చారు.

## స్త్రీలకు ఆస్తిహక్కు

ఇస్లామ్ ధర్మం మహిళలకు ఇచ్చిన హక్కులలో ఆస్తి హక్కు ప్రత్యేకమైనది.

**తల్లిదండ్రులు, దగ్గరి బంధువులు విడిచివెళ్ళిన ఆస్తిలో పురుషులకు భాగం ఉంది. అదేవిధంగా తల్లిదండ్రులు, దగ్గరి బంధువులు విడిచివెళ్ళిన ఆస్తిలో స్త్రీలకు కూడా భాగం ఉంది- అది తక్కువైనా సరే లేక ఎక్కువైనా సరే. (దివ్య ఖుర్‌ఆన్ 4:7)**

## దగ్గరి బంధువుల హక్కులు

తమ ఆయుష్షు పెరగాలనుకునేవారు, తమ సంపదను పెంచుకోవాలనుకునేవారు, దుర్మరణం నుంచి తప్పించుకోవాలనుకునే వారు సిలా రెహ్మ్ (బంధువులతో సంబంధాలను నెరవేర్చడం) చేయాలని చెప్పారు ముహమ్మద్ ప్రవక్త (సఅసం). అనారోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు, మరణ భయం ఇవి మనిషిని నిత్యం వెంటాడుతుంటాయి. ఒక్కోసారి అనారోగ్య సమస్యలు మృత్యుముఖంలోకి చేరుస్తాయి. ఆర్థిక ఇబ్బందులు మనశ్శాంతి లేకుండా చేస్తాయి. ఈ సమస్యలను అధిగమించాలనుకునేవారు బంధువుల హక్కులు నెరవేర్చాలన్నది ప్రవక్త బోధనల సారాంశం. రక్త సంబంధీకులు, తోబుట్టువులు, ఇతర దగ్గరి బంధువుల హక్కులు నెరవేర్చడంలో అలక్ష్యం చేయరాదన్నది ఖుర్‌ఆన్ హెచ్చరిక. కుటుంబ వ్యవస్థను పటిష్టం చేసేందుకు ఖుర్‌ఆన్ గ్రంథం మరెన్నో సూచనలు చేసింది. బంధుత్వ సంబంధాల విషయంలో అల్లాహ్‌కు భయపడండి అని ఖుర్‌ఆన్ హెచ్చరిస్తుంది. ప్రళయదినాన్ని విశ్వసించేవారే బంధువుల హక్కులను నెరవేరుస్తారని ఖుర్‌ఆన్ పేర్కొంటోంది. 'మీ దగ్గరి బంధువుల హక్కును నెరవేర్చండి' అని ఖుర్‌ఆన్ గ్రంథంలో పలుమార్లు హెచ్చరికలున్నాయి. నిరుపేద బంధువుల పట్ల కారుణ్యం చూపాలని, ప్రేమ, వాత్సల్యాలతో మెలగాలని ఖుర్‌ఆన్ సూచన. 'ఆస్తి పంపకాలు జరిగేటప్పుడు ఇతర బంధువులు, అనాథులు, నిరుపేదలు వస్తే, ఆ ఆస్తినుండి వారికి కూడ కొంత ఇవ్వండి.' అన్నది ఖుర్‌ఆన్ ఉద్బోధ. భార్యాభర్తల బంధంతో ఒక్కటయ్యే కుటుంబంలో అన్నా, చెల్లి, భార్యా, భర్త ఇతరత్రా బంధుత్వాలు ఏర్పడతాయి. ఈ సభ్యుల కలయికతో ఏర్పడే కుటుంబం పది కాలాలపాటు మనగలగాలంటే బంధువుల హక్కులు నెరవేర్చబడాలి. బంధువులను అందరికంటే ఎక్కువగా ప్రేమించాలి. ప్రేమను వ్యక్తపర్చాలి. నిరుపేద బంధువుల అవసరాలను తీర్చాలి.

'మీకు రెండు చోట్ల నుంచి విందుకు ఆహ్వానం అందితే అందులో దగ్గరి రక్తసంబంధీకులెవరో వారింటికి వెళ్లండి' అని చెప్పారు ప్రవక్త మహనీయులు. ప్రవక్తలు, ప్రవక్త సహచరులంతా తమ బంధువుల హక్కులు చక్కగా నెరవేర్చారు. మనవల్ల ఏదైనా తప్పు జరిగితే బంధువులను మన్నించమని వేడుకోవడంలో ఆలస్యం చేయరాదని, ఎవరైనా మన్నించమని ప్రాధేయపడితే ఆలస్యం చేయరాదన్నది ఇస్లామ్ బోధనల స్ఫూర్తి. దీనివల్ల దెబ్బతిన్న బంధుత్వ సంబంధాలు మెరుగవుతాయి. వైరం కారణంగా తమ సోదరుడితో మూడు రోజులకు మించి మాట్లాడకుండా ఉండ రాదని ప్రవక్త (స) హెచ్చరించారు. తమ బంధువర్గంలో ఎవరైనా అనారోగ్యానికి గురైతే పరామర్శించడం, దగ్గరి బంధువుల్లో ఎవరైనా చనిపోతే అలాంటి వారి శవయాత్రలో పాల్గొనడం, ఆ కుటుంబం వారిని ఓదార్చడం ధార్మిక విధి. రక్త సంబంధీకులు, దగ్గరి బంధువుల పట్ల సబంధాలను తెగదెంపులు చేసుకుంటే అల్లాహ్ అనుగ్రహం గగనమే అవుతుంది. అలాంటి వారు ఎన్ని దైవారాధనలు, ఉపవాసాలు, హజ్ యాత్ర చేసినా నెరవేరవన్నది ప్రవక్త బోధనల సారం. బంధువుల పట్ల ప్రేమ, వాత్సల్యం కనబర్చి నప్పుడే కుటుంబ వ్యవస్థ పటిష్టమవుతుంది. కుటుంబం పటిష్టమైతే సమాజం పటిష్టంగా ఉంటుంది. సుందర సమాజం ఉనికిలోకి వస్తుంది.

### కుటుంబ సభ్యుల నైతిక శిక్షణ

భర్త ఇంటివారి అవసరాలు తీర్చడమే కాదు ఇంట్లో భార్యాపిల్లల్లో నైతిక శిక్షణ కోసం ఏర్పాట్లు చేయాలి. ఇంటివారందరినీ సుశిక్షితు లుగా తీర్చిదిద్దినప్పుడే కుటుంబ సభ్యుల మధ్య ప్రేమాను రాగాలు, హక్కులు, బాధ్యతలు నెరవేర్చబడతాయి.

### ఇంటివారి శిక్షణ గురించి ఖుర్ఆన్ ఆదేశాలు

**విశ్వాసులారా! మీరు మిమ్మల్నీ, మీ కుంటుంబ సభ్యులనూ మానవులు, రాళ్లు ఇంధనం కాబోయే అగ్ని నుండి కాపాడుకోండి. (66:6)**

**కుమారా! నమాజును స్థాపించు, మంచిని ఆజ్ఞాపించు, చెడు పనుల నుండి నిరోధించు, ఏ కష్టం కలిగినా దానికి సహనం వహించు. ఈ విషయాలు ఎంతో గట్టిగా ఆజ్ఞాపించ బడిన విషయాలు. ప్రజలతో ముఖం ప్రక్కకు త్రిప్పి మాట్లాడకు, భూమిపై నిక్కుతూ నడవకు. అహంభావి, బడాయికోరు అయిన ఏ వ్యక్తినీ అల్లాహ్ ప్రేమించడు. నీ నడకలో సమమైన తూకం పాటించు, నీ కంఠస్వరాన్ని కొంచెం తగ్గించు, అన్ని స్వరాల కంటే అతి చెడ్డ స్వరం గార్దభాల స్వరం." (31:17)**

# అన్నిటికంటే గొప్పది



"దేవుడు భువిని సృష్టించగానే అది కంపించడం ప్రారంభించింది. అప్పుడు దేవుడు పర్వతాలను సృజించాడు. వెంటనే భూమి కంపించడం ఆగిపోయింది. ఇది చూసిన దైవదూతలు ఆశ్చర్యచకితులై దైవాన్ని ఇలా ప్రశ్నించారు. ఓ ప్రభూ! మీ సృష్టితాల్లో పర్వతాలకంటే కూడా బలమైనవి ఇంకేమైనా ఉన్నాయా? అప్పుడు దైవం ఇంతకంటే బలమైనది ఇనుము అని బదులిచ్చాడు. మా ప్రభూ! మీరు సృజించిన వాటిలో ఇనుము కంటే కూడా శక్తిమంతమైనది ఇంకేమైనా ఉందా? అని ప్రశ్నించారు దైవదూతలు. ఆఁ... ఉంది అదే 'అగ్ని' అని పలికాడు దైవం. మళ్లీ దైవదూతలు ఓ మా ప్రభూ! మీ సృష్టిలో అగ్నికంటే కూడా బలమైనది ఇంకేమైనా ఉందా? అని అడిగారు. దానికి దైవం 'నీరు' అని బదులు పలికాడు.

ఓ దేవా! మీ సృష్టితాల్లో నీటికంటే కూడా శక్తిమంతమైన వస్తువింకేమైనా ఉందా? అని మళ్లీ ప్రశ్నించారు దైవదూతలు. ఆఁ... ఉంది. అదే 'గాలి' అన్నాడు దైవం. ఓ మా ప్రభూ! మీ సృష్టిలో గాలి కంటే కూడా శక్తివంతమైనది ఇంకేమైనా ఉందా? ఆఁ... ఉంది. నా దాసుడు తన కుడిచేత్తో చేసిన దానాన్ని ఎడమ చేతిక్కూడా తెలియనంత రహస్యంగా దానం చేస్తాడు. అది వీటన్నిటి కంటే గొప్పది, శక్తిమంతమైనది.

తిర్మిజీ గ్రంథంలోనిదీ సంఘటన. ముహమ్మద్ ప్రవక్త ప్రవచనాల గ్రంథాల్లో తిర్మిజీ అత్యంత ప్రామాణిక గ్రంథంగా భావిస్తారు.

# మతం- రూపం- ఆవశ్యకత

- ఎస్.ఎమ్.మలిక్

(గత సంచిక తరువాయి)

## ఆత్మ పరిచయం

మతం, ధర్మం అన్నది మనల్ని మనకు పరిచయం చేస్తుంది. ధర్మం ద్వారానే మనల్ని మనం సరిగ్గా క్షుణ్ణంగా తెలుసుకోగలుగుతాము. మనం ఎవరము, ఎలా వచ్చాము, ఎలా గతిస్తాము, మరెక్కడికి పోతాము అన్న విషయాలు మనకు ఏమాత్రం తెలియవు. మనం ఇహలోకాన ఎలా బ్రతకాలి, ఏ విధమయిన మనుగడ ఎటువంటి ఫలితాలనిస్తుందో మనకు ఏ మాత్రం తెలియదు. మతం, మత సంబంధమయిన అధ్యయనం మనకు ఈ విషయాలన్నీ విశదంగా తెలుపుతాయి, అలా తెలిపేదే నిజ ధర్మం.

మనకు తెలియని వాటిని తెలిపేదే నిజధర్మం. పరమ ప్రభువు, పరమాత్మ ద్వారానే అవి తెలుస్తాయి. అగోచరమయినవన్నీ, గోప్యమయినవన్నీ, అజ్ఞాతమయినవన్నీ మన అవసరం మేరకు మనకు పరిచితమవుతాయి, ప్రస్ఫుటమవుతాయి. అందువల్లనే విశ్వసనీయంగా పరమ ప్రభువు ద్వారా గ్రహించబడినదే నిజ ధర్మం, అదే విశ్వసనీయం. సత్యానికి గల సకల గుణాలు, ప్రభువు గుణాలు, ఇవే నిజధర్మం గుణాలు కూడా.

## ధర్మాలు అనేకమా?

అనేక ధర్మాల ఉనికిని అంగీకరించడం స్వయంగా అధర్మం. సత్యమే ధర్మమయినప్పుడు అనేక సత్యాలు సాధ్యమా? మరి అనేక ధర్మాలు, సత్యధర్మాలు ఎలా సాధ్యమవుతాయి. సత్యాలు అనేకమని అంగీకరించడం స్వతహాగా అసత్యం, అధర్మం. పూర్వీకుల, తాతముత్తాతల ఏ పనినీ, ఏ ఆలోచననీ, ఏ నమ్మకాన్నీ మన మెరుగము, మనం అవలంబించము కూడా. వారు ధర్మం అని ప్రకటించిన దాన్ని, అవలంబించిన దాన్ని ఎలా అంగీకరిస్తాము, ఎలా అవలంబిస్తాము? అలా అంగీకరించడం, నమ్మడం, అవలంబించడం అసమంజసం, అసంగతం కాదా?

ఏ విషయంలోనూ మనం మన పూర్వీకుల్ని కళ్ళు మూసుకుని అనుసరించము, అనుకరించము, కడకు వారి వృత్తిని సయితం స్వీకరించము. అలాంటప్పుడు, వారు ధర్మమన్న దాన్నే ఎందుకు స్వీకరించాలి, గుడ్డిగా ఎందుకు నమ్మాలి? మన విచక్షణాధికారాన్ని, స్వీకార స్వేచ్ఛను, తృణీకార స్వేచ్ఛను ఎందుకు వినియోగించరాదు, తాత ముత్తాతల బాటను అవలంబించడం మూఢాచారం కాదా? గుడ్డి నమ్మకం కాదా? అహేతుకం, అసమంజసం కాదా? అసత్యం, అధర్మం, అన్యాయం కాదా?

## మానవ తత్వం

వయసు పెరిగిన కొద్దీ, ధార్మిక అవలంబనలో కాలం గడుపుతున్న కొద్దీ మనిషిలో సూక్ష్మత, నిగూఢత, అంతర్వేదన, అన్వేషణా దృష్టి పెరుగుతూ ఉంటుంది. అనుభూతి విస్తృతమవుతుంది. కడకు ఆంతర్యంలో కలిగే ప్రతి అనుభూతి పంచేంద్రియ అనుభూతులనూ ఆవరిస్తుంది.

మానవుడు సంభావ్యాన్నీ తిరస్కరిస్తున్నాడు. మృత్యువు తరువాత లభించే ఏ ప్రతిఫలమయినా, స్వర్గమయినా, నరకమయినా సర్వం సంభావ్యమయినవే, వాటినన్నింటినీ కాదని, తిరస్కరించి మనిషి మహాపరాధమే చేస్తున్నాడు. తనకు తెలియని దాన్ని 'ఏమో?' అని దాటవేయడం కొంత నయం. కాని అది అసలు అసంభవమని కొట్టిపారేయడం, బొంకడం పాపం కాదా? నిజానికి మతం లేదా ధర్మం అన్నది ఆత్మకు ఆస్వాదన కలుగజేయనిది నిష్ప్రయోజనం కాదా? సంభావ్యాలు అటువంటి ఆస్వాదనాంశాలే!

మతం లేదా ధర్మం సురక్షితంగానే ఉంది. కుర్ఆన్ మతగ్రంథం, ధర్మ సందేశం. అది నిస్సందేహంగా భద్రంగా ఉంది. అలాగే కుర్ఆన్ అందజేసిన ప్రవక్త జీవిత చరిత్ర సయితం సురక్షితంగా ఉంది. ప్రవక్త ప్రవచనాలూ హదీసుల రూపంలో భద్రంగా ఉన్నాయి. ధర్మమూ ధర్మ బోధనలు మనిషిని ఎన్నడూ నిరాశ పరచలేదు, నిరాశ పరచవు కూడా. అతని ప్రతి తృష్ణను, అనుభూతుల్ని తీర్చే అవకాశాలను, సామగ్రిని, వాతావరణాన్ని అవి అందజేస్తాయి. అతని ఆశల్ని, అభిలాషల్ని నెరవేర్చుకునే సందర్భాలు కల్పిస్తాయి.

## మానవ సంబంధాలు

ధర్మం లేదా మతం అన్నది ఏదో అయోమయ తత్వం కాదు. మనిషి తన్ను తాను, తన వాస్తవికతను తెలుసుకోవడం, తోటి మానవుల్ని తెలుసుకోవడం, తన సృష్టికర్తను తెలుసుకోవడం- తెలుసుకుని తదనుగుణంగా మసలుకోవడం- ఇదే ధర్మమన్నా మతమన్నా. ఈ సంబంధాలు, స్వయంగా తనతో, తన తోటి వారితో, తన స్వామితో ఏర్పరచుకోవడమే మతం.

నిజానికి మనిషి తన సంబంధాల ద్వారానే గుర్తింపబడతాడు. ఆత్మ జ్ఞానం- తన్నుతాను తెలుసుకోవడం- విషయంలో అతను గడించిన స్థాయిని బట్టి మనిషిని అర్థం చేసుకోవడం సాధ్యమవుతుంది. వాస్తవానికి ఎవరయితే తన్ను తాను తెలుసుకుంటాడో, ఆత్మజ్ఞానం సంపాదిస్తాడో- అతనే తన ప్రభువును తెలుసుకోగలడు. ఇస్లామీయ తాత్వికులు అంటారు : "ఎవరయితే తన్ను తాను తెలుసుకుంటాడో అతనే తన ప్రభువును తెలుసుకుంటాడు." మనల్ని మనం తెలుసుకోగలిగితే ఏ విధంగానూ నష్టబోము. ఏ నష్టాన్నీ గొని తెచ్చుకోము, ఆత్మ నష్టానికి అసలే గురికాము!

తాత్వికులు అంటారు, "దైవం మనిషిని తన రూప లక్షణాలలోనే పోత పోశాడు". ఇది మానవుని పట్ల దైవానికి గల అభేద్యమయిన అనురాగాన్ని, అతి పటిష్టమయిన సంబంధాన్ని చాటుతోంది. మనల్ని మనం సరిగ్గా అవగతపరచుకుంటే మనల్ని మనం ఏ విధంగానూ నష్టపరచుకోము, హాని తలపెట్టము, ఇహంలోనూ పరంలోనూ!

మనకున్న మరో సంబంధం ప్రపంచ ప్రజలతో ఏర్పడిన అనుబంధం. అది మానవ శీల స్వభావాలను చాటే, క్యారెక్టర్‌ను తెలిపే, ప్రవర్తన చూపే, నడవడిని బయల్పరిచే సంబంధం. నైతిక సంబంధం.

## దైవ భావన

సృష్టికర్త, దైవం, పరమాత్మకు తోడుగా, ఎవ్వరూ ఆయన శక్తి సామర్థ్యాలను పంచుకోగలిగే వారు కాజాలరు. ఆయనకు బదులుగానూ మరెవ్వరూ నిలువజాలరు. ఆయన అస్తిత్వం ఏకైకమయినది, అనన్యమయినది. ఆయనకు సంతానమూ లేదు, మరెవ్వరికీ ఆయన సంతానమూ కాదు. అందువల్ల బహు దైవ భావనకు తావే లేదు.

ఈ పూర్వ రంగంలో బహు దైవభావన ఎక్కడయినా, ఎప్పుడయినా చూచాయగా అయినా తలెత్తినా, ఏ సముదాయంలోనయినా అగుపించినా అది దౌర్జన్యం, ఘోరం, మహాపరాధం. ఇది ఎట్టి పరిస్థితిలోనూ క్షమార్హమయినది కాజాలదు. ఇటువంటి విశుద్ధమయిన, పవిత్రమయిన దైవభావనే మానవునికి దైవంతో గల పటిష్టమయిన, విశుద్ధమయిన ప్రగాఢ సంబంధానికి ఆనవాలు.

పరమాత్మ శక్తి ఏకైకమయినదీ, అనన్యమయినదీ కావడమే నిజానికి దేవుని పరిశుద్ధతకు పవిత్రతకు మారుపేరు! అందువల్లనే బహు దైవ భావన అపరాధం. అటువంటి ప్రభువు చూపెట్టిన మార్గాన్ని మారు మాటలాడకుండా అనుసరించడం, ఆ వెలుగులోనే జీవన యానం సాగించడం మాత్రమే విజ్ఞత అనబడుతుంది. దాన్ని వదలి ఇటూ అటూ మార్గబోధనకు దిక్కులు చూడటం అజ్ఞానమే.

## దైవ మార్గదర్శకత్వం

దివ్యకుర్‌ఆన్ మానవాళికి దైవ సందేశం మానవుల భాషలోనే అందజేసింది. కన్నులు చూడటానికి బాహ్య ప్రదేశంలో కాంతి, ప్రకాశం కావాలి. మానవ మేథకు అవగతపరచుకునేందుకు కూడా కాంతి అవసరమే. ఆ వెల్తురు దైవదౌత్యం ద్వారా ప్రాప్తమవుతుందని అంటుంది దివ్య కుర్‌ఆన్. దైవజ్ఞానం అధి భౌతిక జ్ఞానం, ఆధ్యాత్మిక జ్ఞాన సముపార్జనకు దైవ సందేశహరులే మార్గదర్శకులు. అందువల్లనే దైవం కేవలం గ్రంథాన్ని, కుర్‌ఆన్‌ని, 'నూర్' లేదా కాంతిని, దైవ మార్గ బోధకుని ద్వారా ముహమ్మద్ ప్రవక్త ద్వారా పంపడం జరిగింది. కుర్‌ఆన్ బోధనల కాంతిలో దైవప్రవక్తను కుర్‌ఆన్ ఆచరణ కర్తగా పంపడం జరిగింది.

కుర్‌ఆన్‌ని, ఓ భవంతిగా పంపడం జరిగింది. అందులో మానవ మనుగడకు, వ్యక్తిగత, సామూహిక మనుగడకు అవసరమయిన సకల సరంజామా పొందుపరచడం జరిగింది. పొరపాటున దాన్ని గమనించకుండా, గుర్తించకుండా బ్రతుకు హంగామాలో మనిషి దాటిపోయే ప్రమాదముంది కాబట్టి ఆ భవంతి ముఖద్వారం వద్ద "ఇది దైవ వచనం- Word of God" అన్న బోర్డు పెట్టి హెచ్చరించడమూ జరిగింది. అంతేకాదు ఆ భవన యజమాని కూడా అందులో నుంచి ఎలుగెత్తి చాటుతుంటాడు- 'నేను ఇక్కడే ఉన్నాను' అని!

వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ
నైతిక పథకం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

## దైవదౌత్యం

మన సృష్టికర్త, మన  జీవన దాత, మన జీవిక దాత ప్రభువు అభీష్టం, అభిమతం, సమ్మతి ఎందులో ఉందో తెలుసుకునే ఒకే ఒక మార్గం దేవుని ప్రవక్తలు- అదే దౌత్యం, దైవ సందేశ హరులు. దేవుని అభీష్టం, దైవ సమ్మతిని పొందడాన్నే మనం మతం అనీ ధర్మమనీ అంటాము. దైవ ప్రసన్నతా మార్గం లేదా దేవుని అభిమతమే మతం లేదా ధర్మం. ఇదే మానవ మనుగడకు పరమార్థం.

## జ్ఞానం

మతం, మతావలంబన, దైవప్రవక్తల అనుసరణ, పరలోక చింతన- దీనంతటికీ మూలాధారం జ్ఞానం. గ్రంథ జ్ఞానం, విశ్వ జ్ఞానం, జీవన జ్ఞానం, మృత్యువు జ్ఞానం. మానవ జ్ఞాన పరిధులు ఎంతగా విస్తృతమవుతాయో దాని అంతస్తులు ఎంతగా ఉన్నతమవుతాయో అంతగానే జీవన రహస్యాలు, విశ్వ రహస్యాలు, జగతి రహస్యాలు ఆవిష్కృతమవుతాయి.

ఈ జ్ఞానానికి సరోవరం, అనంత ఖని కుర్‌ఆన్. కుర్‌ఆన్ గ్రంథం ఎన్నడూ పాతబడలేదు. అది నిత్య సజీవమయిన గ్రంథం. అది చూపెట్టే బాట రాచబాట. అందులో ప్రస్ఫుటమయ్యేది, అతి సులువుగా బోధపడేది ఒక్కటే-

పరమ ప్రభువు ఆగ్రహం కన్నా ఆయన అనుగ్రహమే పైచెయ్యిగా ఉంటుంది. ఆయన కారుణ్యం, ఉనికి పట్టులో సర్వంపైనా ఆవరించి ఉంటుంది. మనిషి కాస్తయినా అటువైపునకు మొగ్గుదల చూపినట్లయితే చాలు ఆ కారుణ్యం వచ్చి అమాంతంగా అతన్ని చుట్టేసుకుంటుంది. మనిషికి ఆ సద్బుద్ధి, ఆ సద్‌యోగం కలగటమే ఆలస్యం! ఆ సద్బుద్ధి, ఆ సద్‌యోగం, కేవలం నిష్కల్మష ఆంతర్యం, పరిశుద్ధ ఆలోచనలు, పవిత్ర ఆచరణల ద్వారానే ప్రాప్తిస్తాయి. దీన్నే కుర్‌ఆన్ పరిభాషలో 'తజ్‌కియ' అంటారు- పరిశుద్ధ, పరిపూర్ణ, పరిణత, పవిత్ర ఆంతర్యం!!

అటువంటి ఆంతర్యమే వర్తమానంలో భవిష్యత్తును కనుగొం టుంది. ప్రత్యక్షంలో అజ్ఞాతాన్ని, అగోచరాన్ని చూడగలుగుతుంది- దీన్నే జ్ఞానం అంటారు, జ్ఞానమంటే మరేమో కాదు. దైవ విధేయ మయిన హృదయం అంటే కూడా మరేదో కాదు, ఆరోగ్య వంతమయిన, విశుద్ధమయిన, పరిశుద్ధ హృదయం.

అలాగే నరకాగ్ని మరెక్కడి నుంచో రాదు, అది- జనం తమ ఆచరణల ద్వారా సృష్టించుకున్న అగ్ని గుండం, జ్వాలాముఖి!

ప్రవక్త లేదా దైవ సందేశహరుడు మరెవరో కాదు,

ఆ జాతికి హృదయం, ఆంతర్యం!

ఆ జాతికి జ్ఞానం, మేధస్సు!!

సకల సద్గుణ సమగ్ర సంపద!!!


యువతరానికి
విప్లవనాదం
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ఒక వారం చదవండి
ప్రతి వారం చదువుతారు !

చందా వివరాలు

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి
గీటురాయి వారపత్రికను
తెప్పించుకోవచ్చు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు
GEETURAI WEEKLY
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

లేదా

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా
పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే
డి.డి.ని 'Geeturai Weekly'
పేర మాత్రమే తీయాలి.

GEETURAI WEEKLY
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com

# అది అప్పు తీర్చాల్సిందే!

- అర్షియా

**వాగ్దాన పాలన**ను గురుతరమైన బాధ్యతగా ఇస్లాం పేర్కొంది. అది ముస్లింల నైతికతలో భాగమని తెలిపింది. ఏ వ్యవహారంలోనైనా వాగ్దానం చేసినట్లయితే చివరి నిమిషం వరకు నిబద్ధతతో, బాధ్యతాయుతంగా వ్యవహరించి ఆ వాగ్దానాన్ని నెరవేర్చాలి. చేసిన వాగ్దానాలను, ప్రమాణాలను తప్పనిసరిగా నెరవేర్చాలి. అయితే సత్యం కలిగిన వ్యవహారాలకు మాత్రమే ఇవి వర్తిస్తాయి. ఎవరైనా తమ తాహతుకు, సామర్థ్యానికి మించి వాగ్దానం చేయకూడదు. ఒకవేళ అలా వాగ్దానం చేస్తే దానికి పరిహారం చెల్లించి వాగ్దాన భంగం చేయడమే ఉత్తమమని ప్రవక్త(స) సూచించారు. మంచి విషయానికి సంబంధించిన వాగ్దానాన్ని నెరవేర్చడానికి మన పూర్తి శక్తియుక్తులు వెచ్చించాలి. వాగ్దానాన్ని నెరవేర్చడానికి మతిమరుపు లేకుండా ఉండటం, నిలకడతో కూడిన దృఢచిత్తం కలిగి ఉండటం అత్యవసరం. అయితే వాగ్దాన పాలనకు సంబంధించిన చైతన్యం మనలో వేళ్లూనుకుంటే జ్ఞాపకశక్తికి దృఢ నిశ్చయం తోడవుతుంది. అప్పుడు వాగ్దాన పాలనలో మరుపుకు అవకాశం ఉండదు. అలాంటి దృఢచిత్తం కలిగిన వ్యక్తి విశ్వసనీయుల్లో ఒకరిగా ఉంటారు. అల్లాహ్‌తో ఒక ముస్లిం చేసిన వాగ్దానం గొప్పదైన, పవిత్రమైన కొలమానంగా పరిగణించబడుతుంది. మనం అల్లాహ్‌కు ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేరిస్తే ఆయన మనకు ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేరుస్తాడు. వాగ్దాన పాలనలో అన్సారులు ముస్లింలకు ఆదర్శంగా నిలుస్తారు.

ఉత్తమమైన వాగ్దాన పాలన మనిషి గతాన్ని నిరంతరం గుర్తు చేసుకోవాలని ఆశిస్తుంది. దాని ద్వారా అతడు వర్తమానంలో, భవిష్యత్తులో లోపాలు లేకుండా తన కర్తవ్యాలను నిర్వహిస్తాడని ఆశిస్తుంది. గతాన్ని మరచిపోవడం, మరచిపోయినట్లు నటించడం వాగ్దాన భంగం అవుతుంది. అందుకే ఇస్లామియ షరీఅత్‌లో వాగ్దాన పాలన, ఒప్పందాల అమలుకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. వాటి పట్ల అత్యంత బాధ్యతాయుతంగా ఉండాలన్నది ఖుర్‌ఆన్ ఆదేశం. వివాహ(నికాహ్) ఒప్పందానికీ ఇస్లాం ఎంతో ప్రాధాన్యతను ఇచ్చింది. ఈ ఒప్పందం ప్రకారం భర్త తన భార్య హక్కులను హరించకూడదు. ఇలా వాగ్దాన పాలనకు సంబంధించిన అనేక ఆదేశాలు, వాటిని ధిక్కరిస్తే కలిగే పరిణామాల గురించిన హెచ్చరికలు ఖుర్ ఆన్‌లో అనేకం ఉన్నాయి. వాగ్దాన భంగం శక్తిమంతుల్ని శక్తి హీనులుగా, నీచులుగా మార్చేస్తుంది. ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నా చేసుకున్న ఒప్పందాలను గౌరవించి పాటించాలన్నది ప్రవక్త ఉద్బోధ. విశ్వాసి, తిరస్కారి అనే తేడా లేకుండా ప్రతి వ్యక్తికి ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చాల్సిందే. ఇచ్చిన వాగ్దానం అనేది అప్పు లాంటిదే. చెల్లించాల్సిందే. రుణాల చెల్లింపును కూడా తప్పనిసరి బాధ్యతగా ఇస్లాం తెలిపింది. స్వర్గానికి అర్హత సాధించేవారిలో వాగ్దాన పాలన చేసేవారే ముందుంటారు. ముహమ్మద్ ప్రవక్త (స) ఇచ్చిన మాట ఎన్నడూ తప్పలేదు. ‘వాగ్దానం విషయంలో అల్లాహ్ కు జవాబు చెప్పుకోవాల్సి ఉంటుంది’ అని ఖుర్‌ఆన్ హెచ్చరిస్తుంది.

## ప్రళయం రోజున వాగ్దాన ద్రోహుల చేతిలో జెండాలు..

హజ్రత్ ఇబ్నె మస్‌వూద్, ఇబ్నె ఉమర్, అనస్ (రజి)ల కథనం ప్రకారం దైవప్రవక్త(స) ఈ విధంగా ప్రవచించారు. ప్రళయ దినాన వాగ్దాన ద్రోహం చేసినవారిలో ప్రతి ఒక్కరికీ ఒక జెండా ఉంటుంది. “ఇతను ఫలానా వ్యక్తికి వాగ్దాన ద్రోహం చేసినందుకు ఇది గుర్తు” అని ప్రకటించడం జరుగుతుంది.




సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ

**గత సంచిక తరువాయి**

## నాయకులు, పాలకులతో ప్రవక్త (స) వారి ప్రవర్తనా సరళి

మన మతి ఎట్లుంటుందో మన గతి అట్లుంటది. మన నోరు బాగుంటే మనం ఉండే ఏ ఊరైనా బాగుంటుంది. ఇందు నిమిత్తం ఓ సంఘ నీతిని ప్రవక్త (స) బోధిస్తూ

''మనిషి స్థాయి, గౌరవాన్ని బట్టి వ్యవహరించాలి'' అన్నారు.

తాను ప్రబోధించిన సుభాషితానికి స్వయంగా ఆయన కట్టుబడ్డారు. దైవప్రవక్త (స) ముస్లిమేతర సోదరులను సదా ప్రేమ భావంతో పలకరించేవారు. వారితో గౌరవప్రదంగా వ్యవహరించే వారు. ఆయన(స) ఎందరో ముస్లిమేతర చక్రవర్తు లకు, నాయకు లకు ఉత్తరాలు వ్రాశారు. ఆ ప్రముఖులను అక్కడి ప్రజలు ఏ బిరుదుతో పిలిచేవారో, అదే బిరుదుతో వారిని సంబోధించారు. ఉదాహరణకు: రోము చక్రవర్తి హెరిక్లస్‌ను **'అజీముర్రూమ్'** అని సంబోధించారు. ఈరాన్ చక్రవర్తి 'కిస్రా'ను **'అజీముల్ ఫారస్!'** అని వ్రాశారు. అబిసీనియా రాజు నజాషీని కూడా **'అజీముల్ హబష్!'** అని సంబోధించారు (బుఖారీ). 'అజీమ్' అన్న పదంలో ఘనత వహించినవాడా! మాననీయుడా! హిజ్ హైనెస్ అన్న భావాలు ఇమిడి ఉన్నాయి.

మనం చరిత్ర పుస్తకాల్లో అబూ జహల్ అని చదివే, ప్రసంగాల్లో వినే అతని అసలు పేరు, బిరుదు ఏమిటో తెలుసా? అమ్ బిన్ హిషామ్. అబుల్ హకమ్ అతని బిరుదు. మక్కాలో అబూ జహల్ ఆయన (స)కు బద్ధ విరోధి. ఆయన్ని వేధించటానికి, కష్ట పెట్టడానికి దొరికిన ఏ అవకాశాన్నీ అతను జారవిడిచేవాడు కాడు. అయితే అతనిలో సమస్యలకు సమాధానం వెతికే, వ్యవహారాలపై తీర్పులు ఇచ్చే విశిష్ట సామర్థ్యం ఉండేది. అతను ఒక నాయకుడిగా మంచి నేర్పరి, గొప్ప తీర్పరి. ఈ కారణంగా అక్కడి ప్రజలు అతన్ని 'అబుల్ హకమ్' అని పిలిచేవారు. అందువల్ల దైవప్రవక్త (స) కూడా అతన్ని అతను బతికున్నంత కాలం 'అబుల్ హకమ్' అనే సంబోధించేవారు. (సీరత్ ఇబ్నె హిషామ్ : 1/389).

### ముస్లిమేతరులైన బంధువులతో...

ముస్లిమేతరులైన ముస్లింల బంధువులతో, రక్త సంబంధీకులతో ఉత్తమ రీతిలో వ్యవహరించాలని గట్టిగా తాకీదు చేయబడింది. దివ్యఖుర్ఆన్‌లో పన్నెండు చోట్ల బంధుత్వ సంబంధాలను కాపాడాలని ఆజ్ఞాపించటం జరిగింది. సమీప బంధువు పట్ల

సద్వ్యవహారం చేయటంలో రెండింతల పుణ్యం ఉందనీ, దానం (సదకా) చేసినందుకు, బంధుత్వ హక్కును ఇచ్చినందుకు కూడా (మంచి ప్రతిఫలం లభిస్తుందని) మహనీయ ముహమ్మద్ (స) చెప్పారు (తిర్మిజీ). "తన జీవనోపాధి వికసించాలని, తనకు దీర్ఘాయుషు ప్రాప్తించాలని కాంక్షించేవాడు బంధుత్వ సంబంధాలను పరిరక్షించాల"ని ఆయన (స) వేరొక సందర్భంలో వక్కాణించారు (బుఖారీ).

బంధుత్వ సంబంధానికి ప్రాతిపదిక మతంకాదు, రక్త సంబంధమే. బంధువులు ముస్లింలయినా, ముస్లిమేతరులయినా - వారి పట్ల మంచిగా మెలగాలని ప్రవక్త (స) ఆదేశించారు.

ప్రవక్త సహచరులలో అనేకమంది పరిస్థితి ఎటువంటిదంటే, వారి తల్లిదండ్రుల్లో ఒకరు ముస్లిం అయివుంటే, మరొకరు ముస్లిమేతరులుగా ఉండేవారు. ఉదాహరణకు: మహనీయ అబూబక్ర్ (రజి) గారి తండ్రి మక్కా విజయం వరకూ ముస్లిం కాలేదు. కాని అబూబక్ర్ (రజి) మాత్రం తన తండ్రి పట్ల సద్భావంతో మెలిగేవారు. హజ్రత్ అబూ హురైరా (రజి) గారి తల్లి ఇస్లాం స్వీకరించలేదు. పైగా ఆవిడ దైవప్రవక్త (స)ను దూషిస్తూ ఉండేది. అయినప్పటికీ ఆమె పట్ల ఉత్తమ రీతిలోనే మెలగమని ఆయన (స) అబూ హురైరాకు ఆదేశించారు.

(అద్దుర్రుల్ మనూర్ : 6/521)

అబూ బకర్ కుమార్తె యగు అస్మా (ర.అ) వద్దకు ఒకసారి ఆమె కన్నతల్లి వచ్చింది (మదీనాకు). అప్పటికి ఆమె ఇంకా ముస్లిం కాలేదు. అస్మా గారు దైవ ప్రవక్త (స) సన్నిధికి వచ్చి, 'ముష్రిక్కు అయిన నా తల్లికి నేనేమైనా ఇవ్వగలనా?' అని అడిగితే "ఆమె పట్ల ఉత్తమంగా, ఉదారంగా వ్యవహరించు" అని ఆయన (స) ఆజ్ఞాపించారు (బుఖారీ).

## ముస్లిమేతర పొరుగు

బంధుత్వ సంబంధం ముఖ్యమైన సంబంధమైనట్లే, ఇరుగు పొరుగు సంబంధం కూడా చాలా ముఖ్యమైనది. దివ్యఖుర్‌ఆన్‌లో రెండు రకాల పొరుగువారి ప్రస్తావన వచ్చింది. ఒకటి: బంధువులైన పొరుగువారు. రెండు: అపరిచితులైన పొరుగువారు (అంటే బంధుత్వం లేని పొరుగువారు)గా పేర్కొనటం జరిగింది.

కాబట్టి ఈ రెండు రకాల పొరుగువారితో ఉత్తమంగా వ్యవహరించాలని ఆదేశించటం జరిగింది. ప్రవక్త మహనీయులు(స) ఈ విషయాన్ని మరింత గట్టిగా నొక్కి వక్కాణించారు. "ఎవరి (కీడు)వల్ల పొరుగింటి వానికి రక్షణ లేదో అతను విశ్వాసి కాజాలడు" అని ఆయన ప్రవచించారు. ఈ విషయాన్ని ప్రవక్త (స) మూడుసార్లు ఒట్టేసి మరీ చెప్పారు (బుఖారీ).

తన ఇంటి గుమ్మానికి మరీ దగ్గరలో ఉన్నవారే పొరుగువారు. ఈ విషయంలో ఆయన (స) ముస్లింలు - ముస్లిమేతరులన్న విచక్షణ పాటించలేదు. దైవప్రవక్త (స) వారి ఈ ఉపదేశాల ప్రభావం వల్లనే ఆయన గారి సహాబా ముస్లిమేతరులైన పొరుగు వారి పట్ల ప్రేమాదరణలతో మెలిగేవారు. తమ వల్ల వారికెలాంటి భౌతిక నష్టం మానసిక వ్యథ కలగకుండా జాగ్రత్త వహించేవారు.

ఒకసారి హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) ఇంట ఒక మేక కోయబడింది. ఆ రోజు ఆయన ఇంటికి రాగానే, 'నా పొరుగు వాడైన ఫలానా యూదు వ్యక్తికి మాంసం పంపారా? లేదా?' అని దర్యాప్తు చేశారు. ఆ తరువాత ఇలా అన్నారు: "ప్రవక్త మహనీయులు (స) పొరుగువారి యెడల సద్భావంతో మెలగమని గట్టిగా తాకీదు చేసేవారు" (అబూ దావూద్). ఇరుగు పొరుగు వారిలో ఇంకొక రకం 'తాత్కాలిక పొరుగువారు'. అంటే ప్రయాణంలో ఉన్నప్పుడు ట్రైనులోనో, బస్సులోనో, విమానంలోనో మన ప్రక్కన కూర్చుని ఉండే వారన్న మాట. దివ్య ఖుర్‌ఆన్‌లో ఇలాంటి వారు 'సాహెబుల్ జంబ్'గా పేర్కొనబడ్డారు. అలాంటి వారి యెడల మర్యాదగా మెలగాలని కూడా ఆదేశించటం జరిగింది. ఈ ఆదేశం ముస్లింలు, ముస్లిమేతర సోదరులకు కూడా వర్తిస్తుంది.

## సంతోషంలో, దుఃఖంలో పాల్గొనటం

ఒండొకరి మధ్య సత్సంబంధాలు ఏర్పడాలంటే ఒకరింకొకరి సుఖదుఃఖాలలో పాలుపంచుకోవాలి. దైవప్రవక్త(స) ఈ విషయాన్ని కూడా దృష్టిలో ఉంచుకునేవారు. తన ఇరుగు పొరుగువారిలో ఏ ముస్లిమేతర సోదరునికయినా జబ్బు చేస్తే వెళ్ళి అతని పరామర్శ చేసేవారు. ఒక యూదు నవయువకుడు ఆయన (స) వద్దకు వస్తూ పోతూ ఉండేవాడు. ఆయన పట్ల గల ప్రేమాదరణ వల్ల ఆయనకు సేవలు కూడా చేసేవాడు. అతను వ్యాధిగ్రస్తుడైనప్పుడు దైవప్రవక్త (స) ఆ అబ్బాయి ఇంటికి వెళ్ళి పరామర్శించారు. చివరికి ఆ నూనూగు మీసాల నవయువకుడు ఆయన సత్ప్రవర్తనకు ముగ్ధుడయి- బొందిలోని ప్రాణం పోతున్న నాజూకు ఘడియల్లో సత్య ధర్మాన్ని స్వీకరించి చివరి శ్వాస వదిలాడు. అల్హందు లిల్లాహ్! (సహీహ్ బుఖారీ).

పరిచయస్తులైన ముస్లిమేతర సోదరుల అంత్యక్రియలలో కూడా ఆయన (స) పాల్గొన్నారు. అబూ తాలిబ్ మరణించినప్పుడు, ఆయన శవ యాత్రలో పాల్గొనడమేగాకుండా, ఖనన వాటిక

వరకూ వెళ్ళారు (సుననె బైహఖీ). అలాగే ఆయన, ముస్లిమేతరుడైన తండ్రి అబూ తాలిబ్ అంత్యక్రియల ఏర్పాట్లు చేయమని ఆయన కుమారుడైన అలీ (రజి)ని ఆదేశించారు. ప్రవక్త (స) గారి ఈ ప్రబోధనల ప్రభావం ప్రియ సహచరులపై ఎంతగా పడిందంటే, వారు కూడా ముస్లింలుకాని తమ బంధువుల అంత్యక్రియలలో పాల్గొనేవారు.

ముస్లిమేతర సోదరులకు సంతాపం తెలియజేయటానికి, శోక సంతప్త అంతరాళంతో ఉన్న వారిని ఓదార్చడానికి కూడా ఇస్లాం అనుమతినిస్తోంది. "రోగులను పరామర్శించండి. రోగులను పరామర్శించే వాడు స్వర్గంలోని ఒక తోటలో ఉంటాడ"ని మహా ప్రవక్త (స) ప్రవచించారు (ముస్లిం). ఈ ప్రబోధనలో ఆయన ముస్లిం-ముస్లిమేతరుడన్న తారతమ్యం చూపలేదు. పరామర్శకు సంబంధించిన ఈ ఆజ్ఞ సర్వసామాన్యమైనది.

## వాగ్దాన పాలన

వాగ్దానం ముస్లింలకు చేసినదైనా సరే, ముస్లిమేతరులకు చేసినదైనా సరే. దానిని నెరవేర్చటం తప్పనిసరి. ఒకవేళ వాగ్దానానికి విరుద్ధంగా చేస్తే అది పాపం అవుతుంది. దీనికి సంబంధించిన గొప్ప ఉదాహరణ హుదైబియా ఒడంబడిక. మక్కాలో ముస్లింలుగా మారి మదీనాకు వలస వచ్చిన వారిని ముస్లింలు వాపసు చేయాలన్నది ఆ ఒడంబడికలోని షరతుల్లో ఒక షరతు. ఆ ఒడంబడిక ఓ కొలిక్కి వస్తుండగానే హజ్రత్ అబూ జందల్ (రజి) మక్కా నుండి పారిపోయి ముస్లింల వద్దకు వచ్చారు. ఆ సమయంలో అబూ జందల్ కాళ్లకు సంకెళ్ళు వేయబడి ఉన్నాయి. తనను ఎలాగయినాసరే మదీనాకు తీసుకెళ్ళమని ఆయన దైవప్రవక్త (స)కు ప్రాధేయపడ్డారు. ముస్లింలు కూడా ఆయన పరిస్థితిని చూసి తల్లడిల్లిపోయారు. అప్పుడు మక్కా రాయబారి సుహైల్ బిన్ అమ్ర్‌ను వ్యక్తిగతంగా ఎంతగానో నచ్చజెప్పి ఒప్పించడానికి ప్రయత్నించారు. కాని అతను ససేమిరా అన్నాడు. అందువల్ల దైవప్రవక్త (స) అబూ జందల్ని వాపసు చేస్తూ, ఓర్పు వహించమని సూచించారు. అల్లాహ్ త్వరలోనే ఏదయినా మార్గం తెరుస్తాడని ధైర్యం చెప్పారు. (సీరత్ ఇబ్నె హిషామ్-2/302).

## విందుకు ఆహ్వానించటం, ఆహ్వానాన్ని స్వీకరించటం

సామాజిక జీవితంలో పరస్పర సౌహార్ధ సంబంధాలకు ఒక అవకాశం విందుకు ఆహ్వానించటం. అలాగే ఒకరు ఆహ్వానిస్తే ఆహ్వానాన్ని స్వీకరించాలి. మహాప్రవక్త(స) ముస్లిమేతర సోదరులను విందుకు ఆహ్వానించేవారు. ఆయన దైవప్రవక్తగా నియుక్తులైనప్పుడు బనూ హాషిమ్ ప్రముఖులను భోజనానికి ఆహ్వానించారు. ఆ విందు భోజనానికి వచ్చిన వారు 30 మంది వరకూ ఉంటారని అనబడుతోంది. (అల్ బిదాయ వన్నిహాయ: 3/40).

అదే విధంగా ఆయన (స) ఆతిథి మర్యాదను ప్రోత్సహించారు. అతిథులను గౌరవించవలసిన ఆవశ్యకతను నొక్కి వక్కాణించారు. ఈ విషయంలో ఆయన (స) ముస్లింలు-ముస్లిమేతరులన్న విచక్షణ చూపలేదు. ఆయన (స) వద్దకు వివిధ తెగలకు చెందిన అతిథి బృందాలు వచ్చేవి. ఆయన (స) వారికి ఆతిథ్యమిచ్చే వారు. బద్ర్ యుద్ధంలో ఖైదీలుగా పట్టుబడిన వారు ఎవరో కారు, శత్రు సైనికులు. అయినప్పటికీ వారి అన్నపానీయాలకై ఉత్తమ రీతిలో ఏర్పాట్లు చేయమని ఆయన తన సహచరులకు ఆదేశించారు. ఈ కారణంగానే సహాబా తాము సాదాసీదా అన్నం తిని యుద్ధ ఖైదీలకు మాత్రం స్వాదిష్టమయిన భోజన ఏర్పాట్లు చేసేవారు (మజ్మవు జ్జవాయెద్)

## కానుకలు ఇచ్చిపుచ్చుకోవడాలు

"పరస్పరం కానుకలు ఇచ్చిపుచ్చుకుంటూ ఉండండి. తద్వారా ప్రేమ పెంపొందుతుంది (మనస్పర్ధలు దూరమవుతాయి)" అని ప్రవక్త మహనీయులు (స) ఉద్బోధించారు (ముఅజ్జమ్ కబీర్ లిల్ తబ్రానీ). ఈ విషయంలో ఆయన(స) ముస్లింలు-ముస్లిమేతరులన్న తారతమ్యం కనబరచలేదు. పైగా అందరికీ కానుకలు ఇస్తూ ఉండాలని అన్నారు. ఒకసారి దైవప్రవక్త (స) ఒక జత బట్టలను హజ్రత్ ఉమర్ (రజి)కు ప్రదానం చేశారు. ఆ దుస్తులు చాలా ఖరీదైనవి. అందువల్లనే ఆయన (స) వాటిని తొడగలేదు. 'మీరు మీ కోసమే ఇష్టపడనప్పుడు నాకు మాత్రం ఎందుకిచ్చారని హజ్రత్ ఉమర్ (రజి) అడిగితే, "నీకు ఇచ్చింది నీవు తొడుక్కుంటానికి కాదు. దానిని అమ్మివేయి లేదా ఎవరికయినా కానుకగా ఇవ్వు" అని దైవప్రవక్త (స) చెప్పారు. అప్పుడు హజ్రత్ ఉమర్ (రజి) మక్కాలోని ఒక వ్యక్తికి ఆ దుస్తులను బహుమానంగా ఇచ్చారు. ఆ వ్యక్తి అప్పటికింకా ముస్లిం కాలేదు (బుఖారీ).

ఒకసారి మక్కా నుండి ఒక 'నర్తకి' మదీనా వచ్చి ఆర్థిక సహాయం చేయమని అభ్యర్థించింది. దైవప్రవక్త (స) స్వయంగా ఆమెకు ఆర్థిక సాయం అందించటమేగాక, తన కుటుంబీకుల చేత కూడా సాయం చేయించారు. మరి చూడబోతే ఆమె ముస్లిం కాదు. ఆమె వృత్తిని ఇస్లాం ఇష్టపడదన్నదీ విదితమే (బుఖారీ).

**(మిగతా వచ్చేవారం)**

# బాధ్యతను గుర్తు చేసేందుకే ఇజ్తెమా!

- షేఖ్ అబ్దుల్ బాసిత్. కొత్త గూడెం.




**ఓ అల్లాహ్! ఈ ఇజ్తెమా మా జీవితాన్ని సార్థకం చేసుకునే సాధనంగా చెయ్యి.**

దైవ భీతి ఆధారంగా సత్ సమాజ నిర్మాణం కోసం నడుము బిగించిన జమాతే ఇస్లామి హింద్ యోధులారా! సృష్టికర్త కరుణా కటాక్షాలు మీ అందరిపై కురియుగాక.

2024, నవంబర్ 15,16,17 తేదీలలో హైదరాబాద్ 'వాదియే హుదా'లో జరుగబోయే అఖిల భారత జమాతే ఇస్లామి హింద్ సమావేశానికి హాజరు కానున్న మీ అందరికీ స్వాగతం సుస్వాగతం.

ఇలాంటి సమావేశాల కోసం ఇంత శ్రమ, సమయం, డబ్బు ఖర్చు చేయడం సమంజసమా? అని చాలా మంది అడుగుతూ ఉంటారు.

ఈ ఇజ్తెమా, దైవ మార్గాన సర్వస్వం త్యాగం చేయటానికి నాతో పాటు ఇంకా ఎంతో మంది నలుదిశలు విస్తరించి ఉన్నారనే ధైర్యం కలిగించటంతో పాటు, మన కన్నా ముందు ఎంతోమంది తమ జీవితాలను పణంగా పెట్టి ఈ సంస్థ ఉన్నతి కోసం చేసిన త్యాగాలను స్మరించుకుంటూ వారి అడుగు జాడల్లో నడిచే ప్రేరణ పొంది ఇంకా ఉత్సాహంగా పనిచేసే అవకాశం కలిగించటం కోసమే ఈ ఇజ్తెమా!

ఈ సమావేశాలు కేవలం బల ప్రదర్శన కోసం కాదు. నడిచే ఖురాన్‌గా మారి అల్లాహ్ తన నిజ దాసుల నుంచి ఆకాంక్షిస్తున్న ఆచరణాత్మక పనికోసం రథసారథులుగా మారడానికి ప్రేరణ కావాలి.

భోజన సమయంలో, బాత్రూంల వద్ద, పడుకునే చోట, నడుస్తున్నా, నిలబడినా, కూర్చున్నా ప్రతి చోటా సహనానికి, క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచి, దైవ సైనికుల్లా నిలబడే శిక్షణ పొందటానికి.

ధర్మ యుద్ధంలో ప్రాణాలు పోతున్నా, దాహంతో అలమటిస్తూ కూడా, తన కన్న తన తోటివారి దాహం తీర్చడానికే ప్రాధాన్యత ఇచ్చిన ప్రవక్త ముహమ్మద్(స) అనుచరుల త్యాగానికి ప్రతీకగా నిలిచే ప్రతినిధులుగా మారి, సమావేశ స్థలంలో సహనంతో ప్రతి చోటా మన కన్నా మన తోటి వారికి ప్రాధాన్యత ఇస్తూ ఆ త్యాగ ధనుల వారసులుగా నిలవాలి.

ఒక కాలం రానున్నది మొదట్లో మాదిరిగా ఇస్లాం ధర్మం అపరిచితమైనదిగా అవుతుంది. ఆ సమయంలో ధర్మ పరిరక్షణ కోసం, ధర్మ వ్యాప్తి కోసం కృషి చేసేవారికి ప్రవక్త ముహమ్మద్ (స) శుభవార్త తెలిపిన సంగతి మనందరికీ తెలిసిందే కదా.

ఈ కాలంలో అల్లాహ్ మనల్ని ఎన్నుకుని, ఈ సమావేశం ద్వారా ప్రేరణ పొంది మరింత ఉత్సాహంగా ధర్మ సంస్థాపన కోసం కృషి చేసి పరలోక పుణ్యాలు సంపాదించుకునే అవకాశం కల్పిస్తే, పిచ్చాపాటి కబుర్లు చెప్పుకుంటూ, అలసత్వం, అశ్రద్ధ చేస్తూ మూడు రోజులు మూడు క్షణాలుగా టైంపాస్ చేస్తే మన కన్నా దురదృష్టవంతులు మరొకరు ఉండరు.

జాగ్రత్త! సైతాన్ మన బద్ధ శత్రువు. అతడు ఎలాగైనా మనల్ని ఈ ఇజ్తెమా ద్వారా లబ్ధి పొందకుండా శతవిధాలా ప్రయత్నిస్తాడు.

ఏమరుపాటుకు గురి కాకుండా, చిన్న చిన్న అవసరాల కోసం సమావేశ స్థలానికి ఆలస్యంగా రావడం, మనసు పెట్టి ప్రసంగాలు వినకుండా మనల్ని మనం నష్టానికి గురి చేసుకోవద్దు.

మిత్రులారా! నిజంగా మనం చాలా అదృష్టవంతులం. సుమారు 140కోట్ల భారతీయులలో మనలాంటి అల్పులను సత్ సమాజ నిర్మాణం కోసం ఈ భూమి మీద సత్యం, ధర్మం న్యాయం, శాంతి సర్వ మానవ సౌభ్రాతృత్వం సమానత్వ స్థాపన కోసం అల్లాహ్ మనల్ని ఎన్నుకున్నాడు.

రేపు పరలోకం స్వర్గంలో కొందరి ఉన్నత స్థానాన్ని చూసి ప్రవక్తలు, దైవ మార్గంలో ప్రాణాలు అర్పించిన షహీదులు ఈర్ష్యతో కూడిన ఆనందం వ్యక్తం చేస్తారట. ఎవరా అదృష్టవంతులు అని ప్రవక్త ముహమ్మద్ (స) సహచరులు ప్రశ్నించగా

"వారి మధ్య ఎలాంటి రక్తసంబంధం కానీ, ఎలాంటి వ్యాపార లావాదేవీలు ఉండవు, వారు కేవలం దైవ ధర్మ సంస్థాపన కోసమే కలుసుకుంటారు" అని ప్రవక్త ముహమ్మద్(స) తెలిపారు.

మిత్రులారా! ఆ అదృష్టవంతులం మనమే. మన ఈ స్థానాన్ని, మన బాధ్యతను పదే పదే మనకు గుర్తు చేసేందుకే ఈ ఇజ్తెమా. ❖

# అల్లాహ్ కోసమే ప్రేమించండి!

- నసీరా బేగం

**కేవలం అల్లాహ్ కోసమే పరస్పరం ఒకరికొకరు ప్రేమించుకోవటం, ధర్మం ఆధారంగా సోదర సంబంధాన్ని నెలకొల్పడం అనేది మహోన్నతమైన ధర్మకార్యం.** కాని దానికోసం కొన్ని షరతులు, కొన్ని పద్ధతులు ఉన్నాయి. మనిషి వాటిని గనక పూర్తి చేసినట్లయితే అప్పుడు అతను కేవలం అల్లాహ్ కోసమే ప్రేమించిన బిరుదును పొందే హక్కుదారుడు అవుతాడు. ఇంకా ఈ షరతులను ఈ పద్ధతులను అతను పూర్తిగా ఆచరించినట్లయితే ప్రేమపూరితమైన సోదర సంబంధం పటిష్టంగా ఏర్పడుతుంది. సోదర సంబంధాలను చెడగొట్టే, దుష్ట భావాలను రేకెత్తించే షైతాను నుంచి, అలాంటి మానవుల నుంచి అది రక్షించబడుతుంది కూడా.

మంచి శీలం, ఉత్తమ నడవడిక, నైతికత మనుషుల మధ్య సత్సంబంధాన్ని ఏర్పరుస్తుంది. ప్రేమామృత వాతావరణాన్ని కల్పిస్తుంది. ఉన్నతమైన స్నేహ సంబంధాలను చిగురింపజేస్తుంది. అనైతికత ఒక పెద్ద రోగం వంటిది. దానిద్వారా అసూయా ద్వేషాలు జనిస్తాయి. దూరాలు పెరుగుతాయి. స్నేహ సంబంధాల వాతావరణం ఏర్పడజాలదు. అలాంటి వారితో స్నేహం ఏర్పడినా మధ్యలోనే, త్వరలోనే తెగిపోతుంది. కనుకనే నైతికత, అనైతికత రెండు వేర్వేరు వృక్షాల వంటివి. నైతికత వృక్షం మంచి, రుచికరమైన పండ్లను, ఫలాలను ఇస్తే అనైతికత వృక్షం చేదైన, అందవిహీనమైన, అరుచికరమైన ఫలాలను ఇస్తుంది. నైతికతా వృక్షం ప్రజలను తనవైపునకు ఆకర్షించి త్రిప్పుకుంటుంది. అనైతికత వృక్షం తన వద్ద నుంచి ప్రజలను దూరంగా నెట్టివేస్తుంది. కనుకనే నైతికతకు సమాజంలో ఎనలేని ప్రాముఖ్యత ఉంది.

దివ్య ఖుర్ఆన్‌లో కారుణ్యమూర్తి మహాప్రవక్త ముహమ్మద్(స) గారి ఈ సుగుణాన్ని ఇలా ప్రస్తావించబడింది. ఓ ప్రవక్తా! నీవు నిస్సందేహంగా మహోన్నతమైన శీలం కలవాడవు. (68: 4)

దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: చాలామంది ప్రజలు స్వర్గంలో దైవ భయం, ఉన్నతమైన శీలం కారణంగానే ప్రవేశిస్తారు (తిర్మిజీ). ఒకసారి హజ్రత్ అబూహురైరా(ర) గారితో దైవప్రవక్త ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారు : ఓ అబూహురైరా! ఉత్తమ శీలాన్ని, మంచి నడవడికను తప్పకుండా కలిగి ఉండు. దానికి అబూహురైరా (రజి), అంటే ఏమిటీ ఓ దైవప్రవక్తా(స)! అని అడిగారు. దానికి ఆయన(స) ఇలా సెలవిచ్చారు: "ఓ అబూ హురైరా! ఎవడైతే నీతో తెగతెంపులు చేసుకుంటాడో నీవు అతని స్నేహ సంబంధాన్ని కలిగి ఉండు. ఎవడైతే నీపై దౌర్జన్యం చేస్తాడో నీవు అతన్ని క్షమించు. ఎవడైతే నీకు ఇవ్వడో నీవు అతనికి ఇవ్వు."
(బైహఖీ)

ఆయన(స) గారు బోధించిన ఈ బోధనలపై గనక మనిషి ఆచరించినట్లయితే అతను ఒక మహా మనిషిగా రూపొందగలుగుతాడు. ఎందుకంటే ఇది మామూలు విషయం కాదు. వినటానికి చాలా చిన్న విషయంగా అనిపించినా ఆచరించటానికి పెద్ద మనస్సు ఉండాలి. ఇది అందరికీ అతి తేలికగా లభించే సుగుణం కూడా కాదు. అదృష్టవంతులకే ఇది సాధ్యం. ఈ విషయాన్ని అల్లాహ్ దివ్య ఖుర్ఆన్‌లో ఇలా సెలవిచ్చాడు :

ఓ ప్రవక్తా(స)! మంచీ చెడు ఒకటి కావు. నీవు చెడును శ్రేష్టమైన మంచి ద్వారా తొలగించు. అప్పుడు నీ పట్ల శత్రుభావం కలవాడు నీకు ప్రాణ స్నేహితుడైపోవటాన్ని నీవు గమనిస్తావు. ఈ సుగుణ యోగం సహనశీలురకు తప్ప మరెవరికీ లభ్యం కాదు. ఈ స్థానం మహా అదృష్టవంతులకు తప్ప మరెవరికీ దక్కదు. (41: 34,35)

ఒకసారి ఆయన(స) ఇలా సెలవిచ్చారు: నిజమైన విశ్వాసి ఎవడంటే, అతను ఇతరులను ప్రేమించేవాడు, ఇంకా అతను ఇతరులతో ప్రేమింపబడేవాడు. ఎవడైతే ఇతరులను ప్రేమించడో, ఇంకా ఇతరులు అతన్ని ప్రేమించరో అతనిలో ఎలాంటి మేలు లేదు. (తిబ్రానీ)

అబూ ఇద్రీస్ ఖులానీ(ర) ఇలా అంటున్నారు : నేను హజ్రత్ ముఆజ్ బిన్ జబల్(ర) సమక్షంలో హాజరై నేను అల్లాహ్ కోసం మిమ్మల్ని ప్రేమిస్తున్నాను అన్నారు. అప్పుడు ఆయన(ర) ఇలా అన్నారు : మీరు గనక అల్లాహ్ కోసం నన్ను ప్రేమిస్తూ ఉన్నట్లయితే మీ కోసం ఒక గొప్ప శుభవార్త ఉంది. నేను దైవప్రవక్త(స) గారు ఇలా సెలవిస్తూ ఉండగా విన్నాను; ప్రళయదినం నాడు దైవ సింహాసనం చుట్టుపక్కల కొంతమంది ప్రజల కోసం ఆసనాలు వేయబడి ఉంటాయి. వాటిపై కూర్చునే వారి ముఖాలు పున్నమి రాత్రి చంద్రుని మాదిరిగా వెలిగిపోతూ ఉంటాయి. వాస్తవానికి ఆ సమయంలో ప్రజలందరూ భయాందోళనలకు గురై ఉంటారు. కాని వారిలో ఎలాంటి భయాందోళనలు ఉండవు. వారికి ఎలాంటి దుఃఖమూ ఉండదు. అప్పుడు, అయితే వారు మరెవరై ఉంటారు ఓ దైవ ప్రవక్తా(స)? అని ఆయన(స)ను అడగటం జరిగింది. దానికి దైవ ప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు : వారు పరస్పరం కేవలం అల్లాహ్ కోసమే ఒకరినొకరు ప్రేమించుకునేవారు అని. (తిర్మిజీ)

ప్రళయదినం నాడు అల్లాహ్ ఇలా సెలవిస్తాడు : నా కోసం పరస్పరం ప్రేమించుకునేవారు ఎక్కడున్నారు? నేను వారికి ఈ రోజు తన నీడలో స్థానం కల్పిస్తాను. ఆ దినం నా నీడ తప్ప మరే నీడా ఉండదు (ముస్లిం)

హజ్రత్ అలీ(రజి) ఇలా సెలవిచ్చారు : తప్పకుండా మీరు స్నేహం చెయ్యండి. స్నేహితులు తప్పకుండా ఉండాలి. వారు ఇహలోకంలో కూడా పనికొస్తారు. పరలోకంలో కూడా పనికొస్తారు. మీరు ఖుర్ఆన్‌లో ఈ వాక్యం చదవలేదా? నరకవాసులు పశ్చాత్తాపపడుతూ ఇలా అంటారు : దుర్మార్గపు మానవుడు తన చేతులను కొరుక్కుంటూ ఇలా అంటాడు: అయ్యో! నేను దైవప్రవక్తకు తోడుగా ఉంటే ఎంత బాగుండేది. అయ్యో నా దౌర్భాగ్యం నేను ఫలానా వ్యక్తితో స్నేహం చెయ్యకుండా ఉంటే ఎంత బాగుండేది! అని.

కేవలం అల్లాహ్ కోసమే స్నేహ సంబంధాన్ని కలిగి ఉన్న వారి కోసం అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడని దైవప్రవక్త(స) సెలవిచ్చారు: కేవలం నా కోసం ఎవరైతే ఒకరినొకరు కలుసుకుంటూ ఉంటారో నేను వారిని తప్పకుండా ప్రేమిస్తాను. ఇంకా ఎవరైతే నా కోసం ఒకరినొకరు ప్రేమించుకుంటారో నేను వారిని తప్పకుండా ప్రేమిస్తాను. ఎవరైతే నా కోసం ఒకరిపై మరొకరు ఖర్చు చేసుకుంటారో నేను వారిని తప్పకుండా ప్రేమిస్తాను. ఇంకా కేవలం నా కోసమే ఒకరినొకరు సహాయం చేసుకుంటూ ఉంటారో వారిని కూడా నేను తప్పకుండా ప్రేమిస్తాను (అహ్మద్)

అల్లాహ్ కోసం ప్రేమించటం అంటే ఒకరితో మరొకరు కలసిమెలసి ప్రేమపూర్వకంగా ఉండటం, ఒకరి కోసం మరొకరు త్యాగాలు చెయ్యటం, ఒకరి కోసం మరొకరు ఖర్చు చెయ్యటం, ఒకరి అవసరాలను మరొకరు గుర్తించి పూర్తి చెయ్యటం. ఇలా ఉండటం అంటే మామూలు విషయం కాదు. కాని కేవలం అల్లాహ్ కోసం అంటే దీని ప్రతిఫలం అల్లాహ్ దగ్గర తనకు లభిస్తుంది అనే విశ్వాసమే మనిషికి ఈ స్నేహ సంబంధాన్ని దృఢంగా, దీర్ఘకాలంగా ఉంచటానికి పనికొస్తుంది. ఒకవేళ ప్రాపంచిక లాభాపేక్ష కోసం ఎవరైనా ఒకరినొకరు స్నేహాన్ని కలిగి ఉంటే అది ఒక నీటి బుడగ వంటిది. ఎంతోసేపు అది ఉండదు. అల్లాహ్ కోసం చేసే దృఢమైన స్నేహ సంబంధం సమాజ అవసరం కూడాను. ధర్మంపై నిలకడగా ఉండేందుకు, ధర్మాన్ని ప్రచారం చేసేందుకు, ధర్మాన్ని స్థాపించేందుకు ఈ ప్రేమపూర్వకమైన సంబంధం పునాది రాళ్ళ వంటిది. దీని ఉదాహరణ కోసం దైవప్రవక్త(స) గారితో ఆయన(స) గారి అనుచరులు చేసిన స్నేహ సంబంధం, కేవలం అల్లాహ్ కోసమే ప్రేమించటం, సర్వస్వాన్ని అల్లాహ్ కోసం, అల్లాహ్ ప్రవక్త కోసం ధారపోయటం అని తెలుస్తోంది. వారి సంబంధం ఇటుకలను ఒక్కొక్కటిని చేర్చి దృఢంగా కట్టబడిన గోడ మాదిరిగా ఉండేది. ధర్మం విషయంలో కష్టాలు నష్టాలు వచ్చినా ఆ గోడను కొట్టుకొని తునాతునకలైపోయాయే గాని వారిలో రవ్వంత కంపనం కూడా రాలేదు. ప్రస్తావించటానికి చాలామంది అనుచరుల జీవితాలు ఉన్నా ఇక్కడ మనం దైవప్రవక్త(స) గారి ప్రియ అనుచరులు అయిన హజ్రత్ అబూబకర్(ర) గారు ఆయన(స)తో స్నేహ సంబంధం ఏర్పడిన మొదటి రోజు నుంచే దాని హక్కును నెరవేర్చటం ప్రారంభించి చివరి శ్వాస వరకు కొనసాగించారు. ఇదంతా కేవలం అల్లాహ్ కోసమే ఆయన చేశారు. ఆయన(ర) అల్లాహ్ మార్గంలో తన మొత్తం ధనాన్ని ఖర్చు చేశారు. అనుక్షణం ఆయన(స) గారితో నీడ మాదిరిగా వెన్నంటి ఉండేవారు. ధర్మ ప్రచార మార్గంలో సంపూర్ణంగా సహకరించారు. తన ప్రియ కూతురిని సైతం దైవప్రవక్త(స) గారికిచ్చి వివాహం కూడా చేశారు. ఈ విధంగా ఆయన అల్లాహ్ కోసం చేసిన త్యాగాలను మెచ్చిన అల్లాహ్ ఒకసారి ఆయన(ర) దైవప్రవక్త(స) సమక్షంలో ఉన్నప్పుడు తన దూత జిబ్రీల్(అ) ద్వారా తన సలామ్‌ను కూడా పంపించాడు. దానికి లభించే బహుమానం ఇంత గొప్పగా ఉంటుంది మరి!

# పిసినారి వ్యాపారి

ముహమ్మద్ వహీదుద్దీన్

**పూర్వ కాలంలో** వజీర్ అలీ ఖాన్ అనే ఒక వ్యాపారి ఉండేవాడు. అతని వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగేది. ఫలితంగా ఆ వ్యాపారి నగరంలో గొప్ప సంపన్నుడయ్యాడు. మూడు తరాలు కూర్చుని తిన్నా తరగని సంపద ఉన్నప్పటికీ వ్యాపారి మహా పిసినారి. స్వార్థపరుడు. తన ఆస్తి పాస్తులను, బంగారం, వెండి, ఖరీదైన వాహనాలు చూసుకుని తెగ మురిసిపోయేవాడు. తాను ఎంత పిసినారి అయినప్పటికీ తన భార్యా పిల్లల అవసరాల విషయంలో ఏమాత్రం లోటును కనబరిచేవాడు కాదు. రకరకాల రుచికరమైన ఆహారాన్ని భుజించేవాడు. మాంసం అంటే ఇష్టం. చేపల పులుసు అంటే మరీ ఇష్టం. టేబుల్‌పై రకరకాల వంటకాలు చేసి ఉన్నాయి. తన భార్యా పిల్లలతో కలిసి భోజనం చేయ ప్రారంభించాడు. ఆ సమయంలో ఇంటి గుమ్మం ముందు ఒక (భిక్షువు) బికారి, "అమ్మా! బాగా ఆకలేస్తుంది, తినడానికేమైనా ఉంటే పెట్టండి, పుణ్యముంటుంది" అంటూ చాలా వేడుకున్నాడు.

బికారి మాటలు విన్న వ్యాపారి భార్య తన భర్తతో "ఏమండీ అల్లాహ్ దయవలన మనం ధనికులమయ్యాము. రకరకాల రుచికరమైన వంటకాలను భుజిస్తున్నాము. మీరు అనుమతిస్తే కొంచెం అన్నం కూరను ఆ బిక్షగాడికి వేస్తానండి." అని అన్నది. ఈ మాటలు విన్న వ్యాపారి "నేను కష్టపడి సంపాదించేది ఊళ్లో వాళ్లకి పంచడానికనుకుంటున్నావా?" అగ్రహంతో ఊగిపోయాడు. భర్త మాటలకు ఆమె ఎంతో బాధపడి దైవాన్ని క్షమాపణలు వేడుకుంది. తన భర్తకు నచ్చజెప్పేందుకు ఎంతో ప్రయత్నించింది. "తోటి వారు ఆకలితో ఆలమటిస్తుంటే తాను మాత్రం కడుపునిండా భజించేవాడు ముస్లిం కాజాలడు" అనే అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స) హదీసును కూడా క్లుప్తంగా వివరించింది. అయినప్పటికీ వ్యాపారి మనసు మాత్రం ఎంత మాత్రం కరగలేదు. పైగా ఆ వ్యాపారి ఆగ్రహంతో గుమ్మంవద్ద నిబడి ఉన్న భిక్షగాడిని దుర్భాషలాడుతూ, తిడుతూ, మెడ పట్టి గెంటేశాడు.

భార్య తన భర్తలో మార్పు తెచ్చేందుకు ధనాన్ని "అల్లాహ్ మార్గంలో ఖర్చు చేయండి" అని విన్నవించుకుంది. అయినప్పటికీ తనను తాను సంస్కరించుకోలేకపోగా భార్య ప్రవర్తన నచ్చక ఆమెను ఇంటి నుంచి బయటకు గెంటివేశాడు. ఆమె తన పుట్టింటికి వెళ్ళిపోయింది. ఆమెను శాశ్వతంగా వదిలించు కునేందుకు విడాకులు కూడా తీసుకున్నాడు.

కొంతకాలం గడిచిన తరువాత ఆమె తల్లిదండ్రులు ఆమెను మంచి వ్యాపారి జమీర్ ఖాన్‌కు ఇచ్చి పెళ్లి చేశారు. ఇద్దరూ అన్యోన్యంగా ఉండసాగారు. వారిరువురూ ఉన్న దాంట్లోనే తిని ఇతరులనూ ఆదుకునే వారు. ఇరుగుపొరుగు హక్కులను గుర్తించేవారు. బీదవారికి సహాయం చేసేవారు. మధ్యాహ్నం పూట ఒకరోజు వాళ్లిద్దరూ భోజనం చేస్తున్న సమయంలో ఒక భిక్షగాడు ఇంటి గుమ్మం ముందు నిల్చుని "అమ్మా! బాగా ఆకలిగా ఉంది" అంటూ వేడుకోసాగాడు. ఈ మాటలు విన్న వ్యాపారి భార్య నాజియా బేగం భిక్షగాడిపై జాలి పడింది. వెంటనే తన భర్త అనుమతితో అన్నం, మాంసం, చేపల పులుసు, కూరలను బయట నిలబడి ఉన్న ఆ భిక్షగాడికి దానం చేసింది. ఇంట్లోకి రాగానే ఆమె బోరున విలపించింది. దీన్ని గమనించిన భర్త "ఎందుకేడుస్తున్నావు" అని అడిగాడు. కాని ఆమె కారణాన్ని తెలిపేందుకు నిరాకరించింది. భర్త పదేపదే అడగడంతో అసలు విషయాన్ని ఇలా తెలిపింది. "ఇప్పుడు వచ్చిన భిక్షగాడు ఒకప్పుడు పెద్ద వ్యాపారి, ఆయన నా మాజీ భర్త, అప్పట్లో నేను, ఆయన కలిసి భోజనం చేసే సమయంలో ఓ భిక్షగాడు వచ్చి ఆకలేస్తుందని చాలాసేపు వేడుకోగా అతన్ని చీదరించుకున్నాడు, గెంటివేశాడు. ఈ రోజున ఆయనే భిక్షగాడయ్యాడు." అని భర్తకు వివరించింది. దీనికి భర్త "ఆ రోజు మీ ఇంటికి అడుక్కోవడానికి వచ్చిన ఆ భిక్షగాడిని నేనే." అని చెప్పడంతో ఆశ్చర్యపోవడం ఆమె వంతయింది.

అల్లాహ్ మనకు ఏది ప్రసాదించినా, ఎల్లప్పుడూ కృతజ్ఞతలు తెలుపుతూ ఉండాలి. దానధర్మాలు చేస్తూ ఉండాలి. అల్లాహ్ మన సంపదలో వృద్ధిని పెంచుతాడు.

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**